జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php
సంపుటి 15 సంచిక 363 విశాఖపట్నం శనివారం 17 సెప్టెంబరు 2022 8 పేజీలు వెల : 5.00






## రాష్ట్ర జీడీపీ గతం కన్నా బాగుంది..: జగన్



అమరావతి ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర జీడీపీ గతం కన్నా బాగుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఏపీ అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఏడాదికి అప్పుల పెరుగుదల 17.45 శాతం అన్నారు. ఏడాదికి అప్పుల్లో సగటు పెరుగుదల 12.73శాతం అన్నారు. రాష్ట్రం చేస్తున్న అప్పులు చెల్లించడం కష్టమని చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో కేంద్రం కన్నా రాష్ట్రం అప్పుల శాతం పెరిగిందన్నారు. ఇప్పుడు కేంద్రం కన్నా రాష్ట్రం అప్పుల శాతం తగ్గిందన్నారు.రాష్ట్రం ఆర్థికంగా బాగానే ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పెట్టుబడులు, పారిశ్రామిక ప్రగతిపై చర్చ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వచ్చిన ముప్పు ఏమీ లేదన్నారు. ఆర్థికంగా రాష్ట్రం బాగుందని చెబితే కొందరు ఆ వాస్తవాన్ని జీర్ణించుకోలేరని అన్నారు. రాష్ట్రానికి నిధులు రానివ్వకపోతే పథకాలు ఆగిపోతాయని కొన్ని శక్తులు అనుకుంటున్నాయన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 98.4శాతం నెరవేర్చామన్నారు.

## టీడీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి ఖరారు?



అమరావతి ప్రజాపాలన ప్రతినిధి:గతంలో జరిగిన ఎన్నికలు ఒక ఎత్తు.. 2024లో ఏపీలో జరగబోయే ఎన్నికలు ఒక ఎత్తు. అనేక కారణాల రీత్యా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపార్టీలైన వైఎస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం, జనసేన పార్టీలు వీటిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అసెంబ్లీ అభ్యర్థులను ఎంపిక చేయడం ఒక కసరత్తుకాగా, లోక్‌సభ స్థానాలకు ఎంపిక చేయడం అంతకు మించిన కసరత్తు అవుతుంది. ప్రస్తుతానికి అధికారంలోని వైసీపీ, ప్రతిపక్ష తెలుగుదేశం ఈసారి ఎక్కువ ఎంపీ సీట్లను సాధించడంపైనే దృష్టిసారించాయి.తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తన వైఖరికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తమ నేతలో ఈ మార్పు చూడని పార్టీ శ్రేణులు కూడా తొలిసారి దూకుడైన రాజకీయం చేస్తున్న బాబును చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నడూ లేనివిధంగా చంద్రబాబు ఈసారి కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ముందుగానే ప్రకటించుకుంటూ వస్తున్నారు. సీట్లు ఖరారు చేయకుండా చివరివరకు నాన్చుతారు అనే ముద్రను ఆయన తొలగించుకోవాలనేరీతిలో ఆయన వైఖరి ఉంది. కడప, రాజంపేట స్థానాలకు ఎంపీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించారు. ఇప్పుడు నరసరావుపేటపై ఆయన దృష్టి పడింది.కొంచెం కష్టపడితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నరసరావుపేట లోక్‌సభ స్థానాన్ని సులువుగా గెలుచుకోవచ్చని ఆ పార్టీ భావిస్తోంది. 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి రాయపాటి సాంబశివరావు విజయం సాధించారు. 2019లో ఓటమిపాలయ్యారు. వయోభారంతో ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాలకు దూరమవడంతో పార్టీ కొత్త అభ్యర్థిని ఎంపిక చేయబోతోంది. పలువురు పారిశ్రామికవేత్తలు పోటీలో ఉన్నప్పటికీ ఎవరిని ఖరారు చేయనున్నారనేది తెలియరాలేదు. మైదుకూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ నేత పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు పుట్టా మహేష్ యాదవ్‌ను నరసరావుపేట లోక్‌సభ స్థానానికి దింపాలని నిర్ణయించినట్లు సమాచారం.

పుట్టా మహేష్ యాదవ్ కు ఇస్తారా?

తన కుమారుడిని అక్కడ పోటీకి దింపితే అవసరమైతే మైదుకూరు నుంచి తాను తప్పుకుంటానని సుధాకర్ చంద్రబాబుతో చెప్పినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీలోని మరో సీనియర్ నేత యనమల రామకృష్ణుడుకు మహేష్ అల్లుడవుతారు. టీడీపీ నిర్వహించుకున్న అంతర్గత సర్వేలో నరసరావుపేట లోక్‌సభ పరిధిలోని వినుకొండ, గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో యాదవ సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉండటంతో ఆ కోణంలో అభ్యర్థిని ఎంపికచేస్తే విజయం సులువని తేలింది. పుట్టా మహేష్ రెండురోజుల క్రితమే పార్టీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుణ్ని కూడా కలిశారు. పార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ నేతలు మహేష్ కోసం ప్రయత్నం చేస్తుండటంతో ఆయనకు దాదాపుగా సీటు ఖరారవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## బహుజనుల చైతన్యానికి...

# 'ప్రజాపాలన' పునాదులు కావాలి

- రాజకీయ క్రీడలో వ్యవస్థలు పావులుగా మారుతున్నాయి
- బహుజన రాజ్యాధికారం నినాదం ఎన్నికల్లో హామీలకు పరిమితం అవుతోంది
- మీ ప్రాంతంలో మీరే పత్రిక యాజమానులుకండి
- డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ విదానాన్ని తెలుగు రాష్ట్రాల లో వ్యాప్తి చేయండి
- ప్రజాపాలన ప్రత్యేక సమావేశంలో డాక్టర్ కటికెల శివభాగ్య రావు



ప్రజాపాలన బ్యూరో, సెప్టెంబర్16, హైదరాబాద్:రాజకీయ చక్రం లో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం అయి పోతున్నాయని ఈ నేపథ్యంలో బహుజనుల చైతన్యానికి , అంబేద్కర్ బావజాల వ్యాప్తి కి' ప్రజాపాలన ' పునాదులు కావాలని స్నేహ గృప్ ఆధినేత , ప్రజాపాలన దిన పత్రిక వ్యవస్థాపకులు డాక్టర్ కటికెల శివభాగ్య రావు అన్నారు. ప్రజాపాలన తెలుగు దినపత్రిక నేటితో 14సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరూ బహుజనులే(SC, S T, BC, O C, Muslim, Christian minorities Buddhist) అని బహుజనులకు రాజ్యధికారం ,లక్ష్యం గా వేదావి వర్గం ఉద్యమిస్తున్నప్పటికి పలు లోపాల కారణం గా ఆశించిన ప్రతిఫలం దక్కడంలేదు అన్నారు.చాలా పత్రిక లు రాజకీయ పార్టీల ప్రచార కరపత్రాలు అయ్యాయని , అంబేద్కర్ బావజాల వ్యాప్తి బహుజనుల మస్యలు మరుగున పడిపోయాయని అన్నారు. అందుకే ప్రజాపాలన పత్రిక కు తెలుగు రాష్ట్రాల లో ప్రతి మండలంలో ఒక పత్రిక ఓనర్ని చేయడం ద్వారా ఈ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు.

**పేద ప్రజల కోసం వ్యవస్థలు కాపాడాలి.**

ఉన్నోడు అర్థ భలంతో , నాయకులు అధికారంతో వ్యవస్థలను అనుకూలంగా మలుసుకుంటున్నారు. ఐతే ప్రజాస్వామ్యం లో బలమైన రాజ్యాంగ వ్యవస్థ లు ఉంటే తప్ప సామాన్య ప్రజలకు న్యాయం జరగదని అన్నారు. ఇందుకోసం బహుజనులలో చైతన్యం కల్పించడం ద్వారా ఈ తప్పుడు మార్గాల లలో వెళ్ళె వారికి అడ్డుకట్ట వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. స్నేహ సంస్థలు ప్రతీ ఒక్కరికి అవకాశం కల్పించి అంబెడ్కర్ బావజాల వ్యాప్తి కి వేదిక సిద్ధం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

**ప్రభుత్వ తప్పుడు విదానాలు ఎండగట్టాలి**

కేందంలో, రాష్ట్రంలో కొలువు దీరిన ప్రభుత్వాలు తీసుకునే ప్రజా వ్యతిరేక, తప్పుడు విదానాలు అయినపుడు ప్రజాపాలన పత్రిక ప్రజలకోసం రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు పెట్టె పాలకుల విదానాలను ఎండగట్టాలని సూచించారు. బహుజను వర్గాల లో చైతన్యం తీసుకుని వచ్చి బహుజన రాజ్యం కోసం అందరూ కృషి చేయాలని కోరారు.

## ఏపీ అసెంబ్లీ నుంచి మరోసారి టీడీపీ సభ్యుల సస్పెన్షన్



అమరావతి ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ అసెంబ్లీ నుంచి టీడీపీ సభ్యులను మరోసారి సస్పెన్షన్ చేశారు. రెండోరోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే రాష్ట్రంలో ధరల పెరుగుదలపై చర్చించాలని టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. అందుకు అధికారపక్షం ఒప్పుకోకపోవడంతో టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. స్పీకర్ సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా శాంతించకపోవడంతో అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ జోక్యం చేసుకున్నారు.రాష్ట్రంలో అనేక కీలక సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని అందుకు సభ్యులుసహకరించాలని కోరారు. అందుకు ప్రతిపక్ష సభ్యులు ససేమిరా (మిగతా 2లో..)

## సీబీఐ, ఈడీ పేరుతో బెదిరింపులు మానండి : మోదీ సర్కార్‌పై కేజ్రీవాల్ ఫైర్



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తోందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. నిత్యం సీబీఐ, ఈడీలపై ఒత్తిడి పెంచే బదులు దేశ అభివృద్ధి దిశగా కేంద్రం కొన్ని సానుకూల చర్యలు చేపట్టడం మేలని హితవు పలికారు.మద్యం పాలసీపై బీజేపీ స్టింగ్ ఆపరేషన్ గురించి ప్రస్తావించగా అసలు మద్యం కుంభకోణం ఏంటో తనకు అర్థం కావడం లేదని కేజ్రీవాల్ బదులిచ్చారు. డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా నివాసంపై జరిపిన దాడుల్లో సీబీఐకి ఏమీ పట్టుబడలేదని గుర్తుచేశారు. స్టింగ్ ఆపరేషన్లను అన్నింటినీ సీబీఐకి సమర్పించాలని సిసోడియా విశ్వాసంతో చెప్పారని అన్నారు.ఆయన ఎలాంటి తప్పు చేసినట్టు తేలితే సోమవారం లోగా అరెస్ట్ చేయాలని లేకుంటే క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఈడీ, సీబీఐ పేరుతో ప్రతి ఒక్కరినీ కేంద్ర ప్రభుత్వం భయపెడుతున్నదని వ్యాఖ్యానించారు. ఎవరైనా తప్పు చేస్తే అతడిని అరెస్ట్ చేయలని వ్యక్తులపై సీబీఐ, ఈడీలను ప్రయోగిస్తూ పోతే దేశ పురోగతి సాధ్యపడదని చెప్పారు.


ప్రజాపాలన దినపత్రిక 15 వార్షికోత్సవ శుభాకాంక్షలు



ప్రజాపాలన దినపత్రిక14 వసంతాలు పూర్తి చేసుకుని 15 వసంతం లో అడుగిడుతున్నశుభ సందర్భమున జిల్లాల వారీగా ప్రజాపాలన జాతీయ తెలుగు దినపత్రికను విస్తృత పరుస్తూ పజలకు చేరువ చేస్తున్న ప్రజాపాలన పత్రిక యాజమాన్యానికి శుభాకాంక్షలు.....

బెరాకా మినిస్ట్రీస్,స్వచ్ఛంద సేవా సంస్థ





# ఎమ్మెల్యే అవినీతి పై ప్రతి కార్యకర్త ప్రతిఘడించాలి




గోకవరం, ప్రజా పాలన ప్రతినిధి :ప్రతి గ్రామంలో ఆత్మీయ సమావేశాలు త్వరలో నియోజకవర్గంలో జ్యోతుల నవీన్ పాదయాత్ర అంశాలపై చర్చ కింద స్థాయి నుండి ఎమ్మెల్యే వరకు చేస్తున్న అవినీతిపై ప్రతి కార్యకర్త ప్రశ్నించాలని గ్రామాల్లో ప్రచారం చేయాలని జగ్గంపేట, గోకవరం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీ గోకవరం లో 22వ తేదీ గండేపల్లి లో 24వ తేదీ కిర్లంపూడి లో27వ తేదీ జగ్గంపేట లో ఆయా మండలాలకు సంబంధించి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పదవులు పొందిన వారందరికీ అభినందన సభ నియామక పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జగ్గంపేట, గోకవరం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నెహ్రూ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేయడం త్వరలో నియోజకవర్గంలో జ్యోతుల నవీన్ పాదయాత్ర, నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించే దిశగా బల పడాలని ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని తెలియజేశారు. గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు వెడనాడి అందరూ ఐక్యమత్యంతో పార్టీ విజయం కోసం పని చేయాలన్నారు. నియోజవర్గంలో అంగనవాడి పోస్ట్ దగ్గర నుండి ప్రతి దాంట్లో లంచం తీసుకుంటు కోట్లాది రూపాయలు దోచుకుంటున్న ఎమ్మెల్యే అవినీతిని ప్రతి కార్యకర్త ప్రజల్లో తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, మంగ రౌతు రామకృష్ణ, జీను మణిబాబు, మంతెన నీలాద్రిరాజు, కన్నబాబు, అడప భరత్ బాబు, ఉంగరాల రాము, సత్యం పెద్దబ్బులు బాదంపూడి ప్రకాష్ పప్పు రాఘవులు మండపాక అప్పన్న దొర, గుండా శివప్రసాద్, ఉంగరాల గణేష్ సలపు నలమహారాజు, పాల్గొన్నారు.

## విద్యార్థులలో వినటం మాట్లాడటం చదవడం రాయడం నాలుగు క్రియలను పెంపొందించాలి





గుంటూరు, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా రెండు సంవత్సరాల తరువాత విద్యార్థులలో విద్య పైన కొంత వెనుకబాటుతనం జరగటం వల్ల ప్రధానంగా చదవడం వ్రాయటం గణితంలో వెనకబడి ఉండటంజరిగినది పై సమస్యను విద్యార్థులలో నుండి పారద్రోలడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ ప్రథమ్ సంస్థ వారితో కలిసి వినూత్నమైనటువంటి రీతిలో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగింది అక్కడ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలో విద్యార్థులకు బేస్ లైన్ పరీక్షలు నిర్వహించి వారి వారి స్థాయిలను బట్టి ప్రథమ సంస్థ వారు ఇచ్చినటువంటి బోధనోపకరణాలను ఉపయోగించి విద్యార్థులు ఆటలు పాటలతో విద్యాబోధన జరిగే విధంగా జరుగుచున్నది ఈ క్రమంలో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మూడు నాలుగు ఐదు 5 తరగతిలోని విద్యార్థులకు జరుగుతున్నటువంటి టిఏఆర్ఎల్ శిక్షణా కార్యక్రమాలను జిల్లా కోఆర్డినేటర్ కంచర్ల వెంకయ్య గారు సందర్శించుట జరిగినది. శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టిఏఆర్ఎల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులను కొన్ని ప్రశ్నల ద్వారా శిక్షణలో పొందినటువంటి అనుభవాలను వారు నేర్చుకున్న అంశాలను కంచర్ల వెంకయ్య గారు పరిశీలించి తగు సూచనలను జారీ చేయడం జరిగినది .ప్రధానంగా కరోనా వలన పాఠశాలలు గత రెండు సంవత్సరాల నుంచి సక్రమంగా జరగనందున విద్యార్థులలో చదవడం రాయడం గణితంలో పూర్తిగా వెనుకబడినటువంటి వారిని గుర్తించి వారిని ఆయా స్థాయిల్లో ముందుకు రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర యోగా సర్వ శిక్ష అభియాన్ ప్రథమ్ స్వచ్ఛంద సంస్థతో కలిసి మూడు నాలుగు తరగతులలో విద్యార్థులకు చదవడం రాయడం గణితంలో ముందంజలో ఉండే విధంగా కృషి జరుగుతుందని దీనిలో భాగంగా శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని టిఏఆర్ఎల్ శిక్షణ పొందుతున్నటువంటి వారిని పరిశీలించి వారిని ప్రథమ్ సంస్థ కోఆర్డినేటర్ కంచర్ల వెంకయ్య గారు అభినందించినారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల ముత్యాలరావు గారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టిఏఆర్ఎల్ శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో చదవటం రాయటం గణితంలో ముందంజలో ఉండడం అభినందనీయమని విద్యార్థులు క్రమశిక్షణతో క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి మరి వివిధ కృత్యాల ద్వారా ఆటపాటలతో ఉపాధ్యాయులు నేర్పుతున్నటువంటి కృత్యాల ద్వారా ప్రగతిని సాధించాలని కోరినారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేయడం జరిగినది. కార్యక్రమంలో శిక్షణ అందజేయుచున్న గురజాల శ్రీనివాసరావు, సిఆర్పి సంపూర్ణమ్మ విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో బొజ్జా తారకం సంస్మరణ సభ

అమలాపురం( ప్రజాపాలన) :హక్కుల పోరాట యోధుడు స్వర్గీయ బొజ్జా తారకం ఏడవ వర్ధంతి సందర్భంగా అమలాపురం జనసేన పార్టీ ఆధ్వర్యంలో బొజ్జా తారకం సంస్మరణ సభ అమలాపురం స్థానిక ప్రెస్ క్లబ్ లోఅమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ శెట్టిబత్తుల రాజబాబు అధ్యక్షతన జరిగినది,ఈ సంస్మరణ సభలో పలువురు జనసైనికులు నాయకులు మాట్లాడారు అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం నిజాయితీగా పోరాడిన యోధుడని ఈనాటి సమాజానికి అటువంటి నిబద్ధత కలిగిన నాయకులు అవసరం ఉందని అటువంటి వారికి జనసేన పార్టీ ఘనంగా నివాళులు అర్పిస్తుంది అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలోకౌన్సిలర్ పిండి అమరావతి రాష్ట్ర నాయకులు మహదశ నాగేశ్వరావు జిల్లా నాయకులు సందడి శ్రీనుబాబు, చిక్కాల సతీష్,చిక్కం భీముడు, తాళ్ల రవి ముత్తాబత్తుల శ్రీను, మోకా బాలయోగి, ఆకుల బుజ్జి , సుధా చిన్న,పిండి రాజా,కుంపట్ల వెంకట రమేష్,సత్తి శ్రీనివాస్,పోనకల ప్రకాష్,చిక్కం సూర్యమోహన్,గోలకోటి వెంకటేష్,తూము రమేష్,మధుర మూర్తి,పోతుమూడి రవికుమార్,కారేం వెంకటరావు,కడిమి చినబాబు,పెయ్యల స్వామి,ఈతకోట రవినాని,గుండెవోగుల బాలరాజు,పామర్తి నాయుడు,పిండి సురేష్,కూనంసెట్టి రాజేష్,జనిపెళ్ల శివాజీ,గిడ్ల బాలకుమార్ కరిముల్లా బాబా,మహ్మద్ షఫీ,అల్లం సురేష్,చిక్కం సుధ,గోళ్ళ కమల,ముత్యాల జనసైనికులు పాల్గొనడం జరిగింది.

## రోటరీ, ఇన్నర్ వీల్ ల ఆధ్వర్యంలో, పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు 50మొక్కలు పంపిణీ



చీరాల, సెప్టెంబర్ 16, ప్రజాపాలన : పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ మొక్కల పెంపకంతోనే సాధ్యమని, రోటరీ క్లబ్ ఆఫ్ చీరా ల అధ్యక్షులు డాక్టర్ ఐ. బాబూరావు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఐ సుభాషిణి లు అన్నారు.అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా, రామకృష్ణాపురం, ఎం.ఎస్ . ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల యందు రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల, ఇన్నర్ వీల్ క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో, 50 మొక్కలు నాటి, విద్యార్థినీ, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు డా.ఐ.బాబూరావు మాట్లాడుతూ, ఓజోన్ పొరకు రంధ్రం పడి, నేరుగా సూర్య కిరణాలు భూమి పై పడుతుండటంతో, ఉష్ణోగ్రత అధికంగా పెరిగి, మానవాళి మనుగడ కష్టత రంగా మారిందన్నారు. పర్యావరణ పరిరక్షణ కొరకు, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాల్సిన అవసరం వుందని తెలియజేశారు.కార్యక్రమంలో డా. ఇస్తర్ల బాబూరావు, సి. హెచ్.బాల వెంకటేశ్వరరావు, చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ సుభాషిణి, లలిత కుమారి, నళిని, హెడ్ మాస్టర్ బాచిన నాగమల్లేశ్వరరావు, టీచర్స్ కె.శ్రీనివాసరావు, సి. హెచ్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## భావి తరాల ఇంజనీర్లకు స్ఫూర్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎన్.ఆర్. అండ్ పి.ఎం. హైస్కూల్ రిటైర్డ్ హెచ్. ఎం.చీరాల సుబ్రహ్మణ్యం



చీరాల, సెప్టెంబర్ 16, ప్రజాపాలన : భావితరాల ఇంజనీర్లకు స్ఫూర్తినిచ్చిన మహోన్నత వ్యక్తి, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, చీరాల ఎన్ఆర్ అండ్ పిఎం. హైస్కూల్ రిటైర్డ్ హెచ్ఎం. చీరాల సుబ్రహ్మణ్యం అన్నారు. చీరాల రాఘవేంద్ర ఆయుర్వేద వైద్యశాలలో, ప్రముఖ కథారచయిత వడలి రాధాకృష్ణ అధ్యక్షతన, మోక్షగుండంవిశ్వేశ్వరయ్య జయంతి సభ నిర్వహించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన టిటిడి ధర్మ ప్రచార పరిషత్ ఉపన్యాసకులు, వెంకటేశ్వర సుప్రభాతం వ్యాఖ్యాత అల్లూరి శివ కోటేశ్వరరావు మాట్లాడుతూ విశ్వకర్మను తలపింపజేసిన మేటి విశ్వకర్మ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని,టీటీడీ ఘాట్ రోడ్డు డిజైన్ రూపకర్త అని విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు.తొలుత మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్కళాశాల అక్రిడేషన్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.సుబ్బారావును ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏమేన్ దేశంలో నీటిపారుదల మురుగు కాలువల వ్యవస్థలను మెరుగుపరిచిన ఘనత మోక్షగుండం వారిదని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, బెంగళూ రు, మైసూర్ విశ్వవిద్యాలయ స్థాపకులు విశ్వేశ్వరయ్య అని వివరించారు.కార్యక్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య అభిమానసంఘం అధ్యక్షులు అన్నంరాజు సుబ్బారావు, రాఘవేంద్ర ఆయుర్వేద వైద్యశాల నిర్వాహకులు దేనువకొండ హరిప్రసాద్, రిటైర్డ్ ఎంఈఓ గాదె.హరి హర రావు, విశ్రాంత ప్రధానోపాధ్యా యులు చీరాల సుబ్రహ్మణ్యం, వెన్నెల కంటి శర్మ, బందా వెంకట కృష్ణ శక్తిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓజోన్ పొర విధ్వంసం, మానవ మనుగడకే ప్రమాదం - రోటరీ ఇన్నర్‌వీల్ క్లబ్ ల అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు, సుభాషిణి దంపతులు




చీరాల,సెప్టెంబర్ 16, ప్రజాపాలన : ఓజోన్ పొర విధ్వంసం -మానవ మనుగడ కే ప్రమాదమన్నారు.ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆంధ్రరత్న మునిసిపల్ హైస్కూల్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ చీరాల అధ్యక్షులు డాక్టర్ ఇస్తర్ల బాబురావు, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఐ.సుభా షిణి లు ముఖ్య అతిధులు గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ అనంత విశ్వంలో జీవమున్న ఏకైక గ్రహం భూమి అని. ఈ భూమిపై సకల జీవరాశుల శక్తికి మూలాధారం సూర్యుడని అన్నారు. జీవరాశుల మనుగడకు హానికరమైన అతినీలలోహిత కాంతి కిరణా లను, సూర్యుడు వెలువరిస్తాడని,అయితే వాతావరణంలో ఉండే ఓజోన్ పొర అతినీలలోహిత కిరణాలను అడ్డుకొని, భూమాతకి రక్షణ కవచం లా నిలబడిందన్నారు.కాలుష్యం చిచ్చురేపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మనిషి స్వార్థాని కి ప్రకృతి ప్రమాదంలో పడుతూనే ఉందని, ఇటీవలే కరోనా రుజువు చేసిందని అన్నారు. పల్లెల నుంచి చాలా మంది పట్టణాలకు వలసబాట పట్టడంతో, కాలుష్యం పెరిగిపోతోందన్నారు.పరిశ్రమలకాలుష్యం,ఓజోన్ పొరకు చేటు తెస్తోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా, మనుషులు అవేవీ పట్టనట్టు వ్యవహరించడంతో వాతా వరణ సమతుల్యత దెబ్బతింటోందని,మానవ తప్పిదాల వల్ల ఓజోన్ పొర నేడు పలుచబడిపోతోం దని,ఓజోన్ పొరలో రంధ్రాలు ఏర్పడటంవల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు.సూర్యునినుంచి వెలువడే అతినీలలోహిత కిరణా లు నేరుగా భూమి మీద పడటం వల్ల సకల జీవరాశు లకూ ముప్పు వాటిల్లుతోంద న్నారు. ఆ వేడిని భూమిపై నివసించే జీవరాసులు సైతం, తట్టుకోలేని పరిస్థితి తలెత్తుతుందన్నారు.అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు బి.సాల్మన్‌రాజు,ఆంధ్రప్రదేశ్ శాస్త్రసాంకేతికమండలి జిల్లాసమన్వయకర్త పవని భానుచంద్రమూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు వై.గాంధీ , కె.రాజేంద్రప్రసాద్, కె.శ్రీనివాసులు,యన్నం యల్లమందేశ్వరరావు, పేరెంట్స్‌కమిటీ అధ్యక్షురాలు డి.యదాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతులుసమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు, ఆర్బికే చైర్మన్ వినతి



చీరాల, సెప్టెంబర్ 16, ప్రజాపాలన : చీరాల మండల పరిధిలో రైతులు ఎదుర్కొంటు న్న సమస్యలను పరిష్కరించా లని, జిల్లాస్థాయి వ్యవసా య సలహా మండలి సమావేశంలో, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కు, వ్యవసాయసలహామండలి (ఆర్.బి.కె) చైర్మన్ కావూరి రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. చీరాలనగర్ ప్రాంతంలో పొలాలకు సాగునీరు సక్రమంగా అందకుండా, అక్రమంగా ఏర్పాటు చేసిన షట్టర్‌ను తొలగించాలని, డి ఏ పి ఎరువులను ఆర్బికే కేంద్రాల ద్వారా ఇవ్వాలని, జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులను ఆర్ బి కే రమణారెడ్డి కోరారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి వైసీపీ ఇన్చార్జి కరణం వెంకటేష్ లు ఎంతో కృషి చేస్తున్నారని వివరిస్తూ, జిల్లా కలెక్టర్ గా సహకారం అందించి, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## హీరో నాగ శౌర్య నగరంలో పాదయాత్ర.....

### ఘన స్వాగతం పలికిన అభిమానులు.....




విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : కృష్ణ బ్రింద విహారి మూవీ ప్రమోషన్లో భాగంగా విజయవాడ లో హీరో నాగ శౌర్య పాదయాత్ర చేశారు.పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఏలూరు రోడ్డు మీదుగా చుట్టుగుంట బి ఎస్ ఎన్ ఎల్ భవన్ వరకు కొనసాగింది.దారి పొడవునా అభిమానులు ఆయనకు స్వాగతం పలుకగా అందరికీ అభివాదం చేస్తూ చిత్రాన్ని ఆదరించాలని అభిమానులను,ప్రజలను కోరారు ఈ సందర్భంగా హీరో నాగ శౌర్య మాట్లడుతూ ఇదే విజయవాడలో సైకిల్ తొక్కుకుంటూ ఈ రోడ్లన్నీ తిరిగాననీ గుర్తు చేశారు.ఈ రోజు తన చిత్ర ప్రమోషన్స్ కోసం పాదయాత్ర చేస్తున్నాననీ తెలిపారు.ఇందులో ఎటువంటి రాజకీయ కోణం లేదనీ అన్నారు.ఒక సినిమాకి ఒక్కొక్క విధంగా ప్రమోషన్ చేస్తారనీ,తాను వినూత్నంగా పాదయాత్ర చేస్తున్ననీ వెల్లడించారు.తిరుపతి అలిపిరి నుండి వైజాగ్ వరకు చిత్రం కోసం ప్రమోషన్స్ చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ నెల 23 న ప్రేక్షకుల ముందుకి ఈ చిత్రం రానుందనీ స్పష్టం చేశారు.బ్రాహ్మిన్ అబ్బాయిగా నా క్యారెక్టర్ అందరినీ నవ్విస్తుందనీ అన్నారు.పూర్తి స్థాయి వినోదాత్మక కుటుంబ కథ చిత్రమని వెల్లడించారు.ఈ చిత్రం ట్రైలర్ కి ఇప్పటికే మంచి స్పందన వచ్చిందనీ,కోవిడ్ సమయంలో సినిమాలు థియేటర్కు వచ్చి చూడట్లేదు అనేది అబద్ధమని తెలిపారు.ప్రేక్షకులు ఇప్పటివరకు తననీ, సినిమాని ఆదరిస్తున్నారనీ చెప్పారు విజయవాడ నాకు ఘన స్వాగతం పలికిందనీ,అభిమానులతో పాదయాత్ర చేయడం సంతోషంగా ఉందనీ హీరో నాగ శౌర్య చెప్పారు.పాదయాత్రలో హీరో తో పాటు హీరోయిన్ శిర్లే సేటియా పాల్గొన్నారు....

## ఏపీ అసెంబ్లీ నుంచి మరోసారి టీడీపీ సభ్యుల సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

అనడంతో వారిని సభ నుంచి ఒకరోజు సస్పెన్షన్ చేయాలని ప్రతిపాదించగా సభా సభ్యుల అనుమతితో స్పీకర్ టీడీపీ సభ్యులను ఒకరోజుపాటు సస్పెన్షన్ చేశారు.సస్పెన్షన్ అయిన వారిలో ఎమ్మెల్యేలు అశోక్, కింజవరపు అచ్చెన్నాయుడు, ఆదిరెడ్డి భవాని, గోరంట్ల బుచ్చయ చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, వెంకట్‌రెడ్డి, జోగేశ్వర్‌రావు, పయ్యావుల కేశవ్, , వెలగపుడి రామకృష్ణబాబు, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, గొట్టిపాటి రవికుమార్, , అనగాని సత్యప్రసాద్, బాలవీరాంజనేయ స్వామి ఉన్నారు.

## ఏపీలో పాలన అక్కడి నుంచే : మంత్రి సంచలన వ్యాఖ్యలు



అమరావతి : ఏపీలో మూడు రాజధానుల విషయమై వైసీపీ మంత్రులు తమ స్వరాన్ని పెంచుతున్నారు. అటు అమరావతి రాజధాని రైతుల పాదయాత్ర ప్రారంభమైన నాటి నుంచి యాత్ర కొనసాగే జిల్లాలకు చెంది న అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు వివాదస్పద వ్యాఖ్యలు చేస్తూ వాతావరణాన్ని వేడెక్కిస్తు న్నారు. వైఎస్ జగన్ క్యాబినెట్‌లోని యువ మంత్రి ఒకరు ఇవాళ రాష్ట్ర పాలనపై సంచలన వ్యాఖ్య లు చేశారు. రాజధాని అమరావతిపై ఏపీ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికి కొందరు ఏపీ మంత్రు లు చేస్తున్న వ్యాఖ్యలపై ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తాజాగా ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మూడు రాజధానుల ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ విధానం నుంచి తప్పు కోలేదని స్పష్టం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే విశాఖ కేంద్రంగా పాలన ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. విశాఖలో రాజధానికి భూముల సేకరణ అవసరం లేదని, తక్కువ ఖర్చుతో రాజధాని చేయ వచ్చని అన్నారు. రాజధాని విశాఖ తరలించేందుకు అవసరమైన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడతామని, బీచ్ ఐటీ కాన్సెప్ట్‌తో విశాఖను అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని వెల్లడించా రు. విశాఖలో భూ అక్రమాల ఆరోపణలను టీడీపీ నిరూపించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా బిజెపి జాతీయ కార్యదర్శి వై.సత్య కుమార్ పుట్టినరోజు వేడుకలు



అమలాపురం, సెప్టెంబర్ 16 (ప్రజాపాలన ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ అమలాపురం జిల్లా కార్యాలయంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి మూగ వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో బిజెపి జాతీయ కార్యదర్శి వై సత్య కుమార్ పుట్టినరోజు వేడుకలను మోకా వెంకట సుబ్బారావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి , తదనంతరం అమలాపురం గవర్నమెంట్ హాస్పిటల్ ల్లో రోగులకు పళ్ళు ఫలహారాలు పంచిపెట్టారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అయ్యల భాష ఎస్సి మోర్చా జోనల్ ఇన్చార్జి దూరి రాజేష్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్, అమలాపురం రూరల్ అధ్యక్షుడు గుమ్మళ్ల రెడ్డి నాయుడు, అల్లవరం మండల అధ్యక్షుడు సుంకర సాయి, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి బోంతు శివాజీ, అమలాపురం పట్టణ ప్రధాన కార్యదర్శి హరివ తేజ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కి రాజ్యాంగానికి మనం ఇచ్చే గౌరవం ఇదేనా..?




భీమిలి ప్రజాపాలన ప్రతినిధి శివ దాలాయి: సమస్యలొస్తే వ్యవస్థల దగ్గరకి వెళ్తారు... కానీ వ్యవస్థలే ప్రజలకు సమస్యలైతే ... ఏమి చెయ్యాలి... ఎవరికి చెప్పాలి... ఇదే మన పరిస్థితి ఇప్పుడు... భ్రష్టు పట్టేసిన వ్యవస్థల వలన ప్రజా జీవితం అస్తవ్యస్తంగా మారుతోంది. రాజకీయ పార్టీల, నాయకుల ప్రభావంతో ప్రతీ వ్యవస్థ కూడా ఏదో ఒక రకంగా దారి తప్పింది. రాజ్యాంగం కల్పించిన హక్కులకి భంగం కలిగితే కాపాడవలసిన వ్యవస్థలే తప్పులు చేస్తే... ప్రజలెవరికి చెప్పుకుంటారు... రాజకీయ నాయకుల ఒత్తిడి వలనో, లేదా వారి అధికారాన్ని చూసి భయపడో వ్యవస్థలోని అధికారులు తమ విధులను సరిగా నిర్వర్తించకపోతే.... ప్రజల గోడు వినేదెవరు...చట్టం, న్యాయంతో సహా అన్ని వ్యవస్థలు కూడా వాటి బాధ్యతలను విస్మరిస్తూ, అధికారంలో వున్న వారి అడుగులకు మడుగులొత్తుతూ తరిస్తున్న పరిస్థితి ఇప్పుడు చూస్తున్నాం. ఇంతకు ముందు పరిపాలించిన వారు కూడా వ్యవస్థలను తమ చేతిలోకి తీసుకున్న దాఖలాలు ఉన్నాయి... వాటిని తమ స్వలాభం కోసం వాడుకున్న సందర్భాలు కూడా వున్నాయి. కానీ ఇప్పుడు పూర్తిగా వ్యవస్థలన్నీ కూడా అధికారంలో ఉన్నవారికి దాసోహం అయిపోయాయి. తాము చేయవలసిన విధులను రాజ్యాంగ బద్ధంగా చేయకుండా, నాయకులను సంతృప్తి పరచడానికి మాత్రమే చేస్తున్నారు. నాయకుల మాట వినకపోయినా, వారు చెప్పినట్టు చేయకపోయినా అధికారులను నానా ఇబ్బందులకు గురిచేసి... తమ దారిలోకి తెచ్చుకుంటున్నారు. గల్లీ స్థాయి నాయకుడు కూడా అధికారులను బెదిరించడం విచిత్రం...లిఇలా నాయకుల కనుసన్నలలో అధికారులు పని చేస్తూ... వాళ్ళు చేసే తప్పులను సమర్థిస్తూ... తమ బాగోగుల కోసం అన్నిటినీ చూసీ చూడనట్టు వదిలేస్తే... భవిష్యత్తు తరాలు భారీ మూల్యం చెల్లించక తప్పదు.

## చిల్డ్రన్స్ హెూమ్ నందు మెడికల్ క్యాంపు ఓ యస్ జి ఫౌండేషన్





భీమిలీ ప్రజాపాలన ప్రతినిధి :లీనా చారిటబుల్ ట్రస్ట్ చిల్డ్రన్ హెూమ్ నందు ఓ ఎస్ జి ఫౌండేషన్ వారు మెడికోవర్ వైద్య బృందం తో మెడికల్ క్యాంపు నిర్వహించారు 21 మంది చిన్నారులకు డాక్టర్ గారు జనరల్ చెకప్ చేసి రక్త పరీక్షలు చేయిస్తే పిల్లలకు హిమోగ్లోబిన్ శాతం అలాగే రక్తంలో ఉన్న ఇన్ఫెక్షన్ నీ గుర్తించవచ్చు అని డాక్టర్ గారు వివరించారు. ట్రస్ట్ ఫౌండర్ కృష్ణ వేణి గారు మాట్లాడుతూ ఇ పిల్లలు అందరూ వేరే వేరే ప్రాంతాల నుంచి తల్లి ఉండి తండ్రి లేని వారు వీళ్ళను దత్తత తీసుకొని పెద్దయ్యి మంచిగా పై చదువులు పెళ్లి చేసి సెటిల్ అయ్యే వరకు పూర్తి బాధ్యత తీసుకుంటు మా సొంత ఖర్చులతోనే ఇ పిల్లలందర్నీ పెంచుకుంటున్నాము.ముఖ్యం గా పిల్లలు వద్దు అనుకొని చాలా మంది చెత్త కుండీలలో కాలువల్లో పడేసి ప్రాణం తీస్తున్నారు మీరు పెంచలేని ఆ పిలల్ల కోసం మమ్మల్ని సంప్రదిస్తే ఆ పిల్లల బాద్యత మేమే తీసుకుంటాం అని మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

## అనాధలకు బట్టలు పంపిణీ చేసి మానవత్వం చాటుకున్న జల్లి సుజాత



అమలాపురంరూరల్( ప్రజా పాలన): ఉన్నంతలో పేదవారికి సహాయం చేయాలని గుణం ఉన్న జల్లి సుజాత ఆదర్శనీయురాలని పలువురు పేర్కొన్నారు, శుక్రవారంఅమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడు మదర్ తెరిసా అనాధాశ్రమంలో ఉన్నవారికి బట్టల పంపిణీ చేశారు ఆమె తండ్రి చీకట్ల నాగేశ్వరరావు జన్మదినం మరియు తల్లి చీకట్ల నాగరత్నం వర్ధంతి ఒకేరోజు కావటం సంతోషాన్ని దుఃఖాన్ని ఒకేలాగా చూసే మంచి మనసున్న వ్యక్తి సుజాత అని పలువురు కొనియాడారు , అమలాపురంలో హెచ్ఐవి, ఎయిడ్స్ బారిన పడిన పదిమంది బాధిత పిల్లలకు సంవత్సరం పాటు పదిమంది పిల్లలకు ఇమ్యూనిటీని పెంచే ఆహారమును అందిస్తున్నారని అలాగే పలు సేవా సంస్థలకు ఆమె ఆర్థిక సహాయంతో పాటు బట్టలు నిత్యవసర వస్తువులు వంటివి అందించడం జరిగింది, ఒక కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు 25 కేజీల బియ్యం అందించడం జరిగింది మరియు జన కళ్యాణ్ సంస్థ స్టాప్ కు చీరలు, బాక్స్ ,ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, ప్రసన్న, సరోజ తదితరులుపాల్గొన్నారు.

# రక్త దానం చేయండి.. ప్రాణదాతలు కండి



భీమిలి ప్రజాపాలన ప్రతినిధి :నా ప్రియమైన ఓ రక్తదాతలారా మానవత్వానికి మీరు నిలువెత్తు నిదర్శనం....18 సం"రాలు వయస్సు నుండి మొదలు అయిన మీలి రక్తదానోత్సవం వర్ణనాతీతంలిముఖ పరిచయమే లేని మేము మీకు ఒక్క కాల్ చేసి ఒకరు చావు బ్రతుకుల మధ్య ఉన్నారు అని చెప్పిన వెంటనే స్పందించి ఆపద అన్న మాట విన్న అరక్షణం కూడా ఆలోచించకుండా వెంటనే స్పందించి స్వచ్ఛంధంగా రక్త నిధులకు విచ్చేస్తూ....మీ స్వచ్ఛమైన మనసుతో చిరునవ్వులు చిందిస్తూ రక్తమిచ్చి ఓ నిండు ప్రాణాలు కాపాడుతున్న నిజ దైవమా మీకు మా హృదయపూర్వక వందనం....మీ అమూల్యమైన మానవత్వానికి శత కోటి వందనం స్త్రీ ,పురుష తారతమ్యం లేకుండా రక్తదాతలారా మీరు చేస్తున్న సేవలు

అమోఘం........అద్భుతం.....అద్వితీయం, అపూర్వం......అనంతం

లినేటి సమాజంలో రక్తం కోసం ఇబ్బంది పడుతున్న వారికి అను నిత్యం నిస్వార్థంగా శ్రమిస్తూ, ఏమి ఆశించకుండా సకాలంలో రక్తం అందిస్తున్న సేవా తత్పరులందరికీ నా సెల్యూట్...మా అందరి ఆశ, ఆకాంక్ష ఒక్కటే ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు రక్తదానం చేయగలిగితే నేడు రక్తం కొరత వల్ల వేలప్రాణాలు మట్టిలో కలిసిపోవు ఇవాళ – రేపు మూగ జీవులు సైతం రక్త దానం చేస్తున్నాయి,ఎందరో స్త్రీ మూర్తులు సైతం స్వచ్ఛంద రక్త దానం చేస్తున్నారు ఎలాంటి అపోహలకు తావులేకుండా మానవత్వం ఉన్న మనుషులుగా ప్రతీ 3 నెలలకొకసారి స్వచ్ఛంద రక్తదానం చేసి ఆపదలో ఉన్న నిండు ప్రాణాలను కాపాడుకుందాం. "రక్తం దానం చేసి ఓ ప్రాణం కాపాడటం మనందరి బాధ్యత,ప్రతీ ఇంటి నుండి రక్త దాత రావాలి ప్రతీ ఒక్కరికీ రక్త దానం అలవాటు కావాలి".

## తెదేపా ఆధ్వర్యంలో కొనసాగిన అన్నా క్యాంటీన్



భీమవరం, సెప్టెంబర్ 16 (ప్రజాపాలన ప్రతినిధి) : నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని బీవీరాజు పార్క్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహంవద్ద శుక్రవారం టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి నౌషాద్ సౌజన్యంతో పేదలకు అన్నా క్యాంటీనులో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేతనైతే పేదలకు అన్నం పెట్టండి కానీ అన్నం పెట్టేవారికి ఆటంకాలు కలిగించవద్దని హితవు పలికారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ శాసనసభలో పరిశ్రమల గురించి చర్చలేవనెత్తిన టిడిపి ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. పట్టణ కన్వీనర్ వేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి నాయకుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈరోజు కార్యక్రమాన్ని నిర్వహించిన టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి నౌషాదును ఆయన అభినందించారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్విశంకర్, నాయకులు ఎద్దు ఏసుపాదం, గునుపూడి తిరుపాల్, మైలాబత్తుల ఐజాక్ బాబు, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, పంతం వెంకటసతీష్, పామర్తి వెంకటరామయ్య, కటికల పల్లారావు, సయ్యద్ నసీమాబేగం, పడమట సోమేశ్వరరావు, పాల శ్రీరామదాస్, మండవల్లి ఈశ్వర్, ఎండి ఖలీల్, ఎస్.కె రబ్బానీ, ఎండి ఫిరోజ్, యలమంచిలి శ్రీనివాస్, తిప్పు బాలముత్యం, పడమట నరసింహమూర్తి, నేదునూరి గంగాధర్, దొంగ వెంకటేశ్వరరావు, నల్లం గంగాధర్, బొక్కా శ్రీనివాస్, తుంపుడి వెంకటకృష్ణగుప్తా, మల్లువలస రాము, సతివాడ హరిబాబు, కొండ్రు శ్రీనివాస్, ముల్లుగుర్తి శ్రీనివాస్, భూపతిరాజు బుజ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ డే




నరసాపురం, సెప్టెంబర్ 16 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక బి.జి.బి.ఎస్ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ ఓజోన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.నీరజ, వైస్ ప్రిన్సిపాల్ జి. రాధ, కామర్స్ హెడ్ డాక్టర్ కె.మధుషాలిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. రజని, మాథమాటిక్స్ హెడ్ కె. మాధురి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ నీరజ మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణ కోసం అంతర్జాతీయ దినోత్సవాన్ని ప్రతి ఏటా సెప్టెంబర్ 16 న జరుపుకుంటున్నామని ఓజోన్ పొర సూర్యనికి భూమికి మధ్యలో 10 కిమీ మందంతో ఉంటుందని సూర్యుని నుంచి వచ్చేఅతి నీలలోహిత కిరణాలను మానవునిమీద పడకుండా ఓజోన్ కాపాడుతుందని వివరించారు. పర్యావరణాన్ని మనం కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించరాదని, పరిశ్రమల నుండి వచ్చే విషవాయువులను అరికట్టాలని, క్లోరో, ప్లోరో, కార్బన్ల నుండి మనల్నిమనం రక్షించుకోవాలని దీనిపై ప్రజల్లో సరియైన అవగాహన కలిగించాలని సూచించారు. ప్లాస్టిక్ సంచులను, ప్లాస్టిక్కును నిరోధించడానికి ప్రజలలో అవగాహన కల్పించాలని అడవులు నరికివేత అరికట్టాలని మోటారు వాహనాలనుండి వచ్చే.కార్బన్ మోనాక్సిడ్ వాయువులను అరికట్టాలని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి.నీరజ, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ప్రతిజ్ఞ చేసారు.

## సర్పంచ్ కి సమాచారం లేకుండా శంకుస్థాపన కార్యక్రమం

అమలాపురం (ప్రజాపాలన) :అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలోపలు అభివృద్ధి కార్యక్రమాలు కు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ సభ్యురాలు చింతా అనూరాధ హాజరయ్యారు.తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలో రెండు శంకుస్థాపన కార్యక్రమాలు జరగగా ఒక కార్యక్రమానికి మాత్రమే సర్పంచ్ కి సమాచారం ఇచ్చి మరొక కార్యక్రమానికి సర్పంచ్ కి సమాచారం ఇవ్వలేదని తుమ్మలపల్లి సర్పంచ్ వడ్డీ సుభాషిని ఆరోపించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.గ్రామంలో ఏ కార్యక్రమం జరిగిన ఫోటోకల్ ప్రకారం గ్రామ సర్పంచ్ కి సమాచారం ముందుగానే ఇస్తారాని కానీ తుమ్మలపల్లి లో దీనికి భిన్నంగా జరిగిందని తనకు ఉద్దేశపూర్వకంగానే తనకు సమాచారం అందజేయలేదని ఆమె తెలియజేశారు. ప్రోటోకాల్ పాటించలనిఅధికారులకు తెలియదా,నాకు కావాలనే సమాచారం చెప్పాలేదని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఉన్నత అధికారులు కు పిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు.

## ప్రత్యేకహెూదా ఇచ్చి రాష్ట్రాన్ని ఆదుకోవాలి



నరసాపురం, సెప్టెంబర్ 16 (ప్రజాపాలన ప్రతినిధి) :ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకహెూదా ఇచ్చి ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సి.పి.ఎం) జిల్లా కార్యదర్శి కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. దేశ రక్షణభేరి యాత్రను శుక్రవారం నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం, సారవ, ఎల్.బి చర్ల, పసలదీవి, సీతారామపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కవురు పెద్దిరాజు మాట్లాడుతూ జి.ఎస్.టి పేరుతో ప్రజలపై వేస్తున్న ఆర్థిక భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. పేదలపై భారాలు వేస్తూ సంపన్నులకు పన్ను రాయితీలు కల్పించడం సిగ్గుచేటని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ విభజనచట్టం ప్రకారం పార్లమెంటసాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి రెండు పూటల పనిని రద్దుచేయాలని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిననాటినుండి దేశంలో మత ఘర్షణలు పెరిగాయని ఆయన విమర్శించారు. సిపిఎం మండల కార్యదర్శి బొక్కా శ్రీనివాస్ మాట్లాడుతూ. పాల ఉత్పత్తులపై కూడా జి.ఎస్.టి వేసి గ్రామీణ ప్రజలపై పన్నులు పెంచారని అన్నారు. బిజెపి విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 24న విజయవాడలో జరిగే బహిరంగ సభకు ప్రజలంతా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లాకమిటీ సభ్యులు ఎం.రామాంజనేయులు, మండలకమిటీ సభ్యులు జల్లి రామ్మోహన్ రావు, గుబ్బల నాగేశ్వరరావు, డి.వి సాగర్, గుత్తుల శ్రీరామచంద్రుడు, వెన్న సింహాచలం, బొక్కా బాబురావు, కవురు సత్యనారాయణ, కుక్కల శ్రీరామమూర్తి, సిపిఎం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మనం గెలవాలంటే

"మన సంస్థలను మనమే నిర్మించుకోవాలి "

బహుజన రాజ్యాధికార స్థాపనకు ప్రజాపాలన పేపర్ ని నియోజకవర్గాల వారీగా కనీసం 10 పేపర్లు అంతకంటే ఎక్కువ పేపర్లు ఆయా నియోజకవర్గాల్లో వెళ్ళేటట్టుగా నాయకులు బాధ్యత తీసుకునేటట్టుగా చేయవలెను.

బాధ్యత తీసుకునే వారికి వారి ద్వారా వచ్చిన అడ్వర్టైజ్మెంట్స్ లో 60 శాతం వారికి ఇవ్వబడును.

ఈ దిగువన తెలిపిన నాయకులు బాధ్యత తీసుకుంటున్నారు..

మిగిలిన వారు కూడా బాధ్యత తీసుకోగలిగితే మన వాయిస్ వెళ్లి గెలవడానికి సహాయకారిగా ఉంటుంది.

**Sivabhagyarao Bahujan IRS-vrs**
Chairman
**Prajapalana**

Jai puley Jai Bheem Jai bharath

ఈ దిగువ తెలిపిన పార్స్ సభ్యులకు ప్రజాపాలన పేపరు పంపబడును

| S.NO | NAME | DESIGNATION | PLACE |
|---|---|---|---|
| 1 | DR. Guduru Seethamahalaxmi | CWC MEMBER, AP State Incharge PARS | Vizag |
| 2 | Gunji Narasimharao | CWC MEMBER, PARS | Nellor |
| 3 | Dr. P.Paramasivan | State Vice President, Tirupathi & Chitloor PARS | Tirupathi |
| 4 | Nammi Apparao | PARS AP State Co-ordinator | Vijayawada |
| 5 | A. Balaram | AP State Co-ordinator, PARS | Pileru |
| 6 | K.Vara Prasad | AP State Secretary, Retd Teachers Vibhagamu, PARS | Bapatla |
| 7 | S.Tirupal | AP State Secretry,NGO Vibhagamu Ananthapur & Hindupur PARS | Ananthapur |
| 8 | Dasari Shyam Living Stone | Vice President, Retired Teachers Vibhagamu PARS | Bapatla |
| 9 | Kagita Achyut Puley | AP State Secretary Eluru, Machilipatnam PARS | Eluru |
| 10 | Repudi Doraka Vani | State Secretary,Humanrights Vibhagamu, Guntur &Narsaraopeta PARS | Guntur |
| 11 | Jada Vijay Kumar | Parliament President, Retd Employees Vibhagamu, PARS | Ongole |
| 12 | Mundlapati Pichiah | President,Badvel Assembly PARS | Badvel |
| 13 | P.Prakasham | Branch Manager,Sneha MACS Ponnur | Ponnur |
| 14 | Sudheer | Reporter | Narasaraopeta |
| 15 | Ratna Raju | Reporter | Nandigama |
| 16 | A.Punnarao | CEO, SNEHA MACS | Vizag |
| 17 | Ch. Chiranjeevi | Sneha Club, Ex Governor | Vizag |
| 18 | Katikala Ravi Kumar | AP State Co-ordinator, PARS | Guntur |
| 19 | P.Anand | Accounts Assistant Officer, AP Genco | Nellor |
| 20 | Kakani Prasada Rao | Assembly President, PARS | Penamalur |
| 21 | Loda Apparao | Assembly President, PARS | Rajamundry Rural |
| 22 | Stalin Babu | Assembly President, PARS | Prattipadu |
| 23 | Jakkala Krupa kumar | Presidnent of Minority section | Prodduturu |
| 24 | Kamalapuram Kiran | President of Ex.Service Man section | Jammalamadugu |
| 25 | Kommalapati Anjaneyulu | President of Building Construction Union | Kamalapuram |
| 26 | Gollapalli bhaskar | President of Education Vibhagamu | Kadapa Dist |
| 27 | Suneetha | President of Women's Vibhagamu | Pileru |
| 28 | Gangadhar rao Nukasani | PARS | Ongole |
| 29 | Nagendra Nayak | State Secretary of Engineering Vibhagamu | Kadapa |
| 30 | Bima Mahesh | Reporter | Amalapuram |
| 31 | Sri Savarala Ganesh | President of the Unorganized Labor Union | Division Chodavaram |
| 32 | P.Siddartha Ambedkar | Coordinating committee of Youth Associastions | Malkapuram |
| 33 | Ravada Satyanarayana | President of Unorganized sector workers union, | Nathavaram |
| 34 | D.Siva | Blood donors vibhagamu working President | Thagarapuvalasa |
| 35 | Sri Uppina Valasa Rao | President of youth organization | Srihari puram |
| 36 | Ghanta Rajkumar | Narasapur Parla ment NGO విభాగపు అధ్యక్షుడు | Bhimavaram |

Please contact this No:8886022523 Krishna veni , Appajee 9000621111 (Prajapalana Telugu Daily)

ప్రజాపాలన

సంపాదకీయం


శనివారం 17, సెప్టెంబరు 2022

# కౌలు సేద్యం భూస్వామ్య వ్యవస్థ అంతర్భాగం!

రైతాంగ ఉద్యమాల ఫలితంగా, ముఖ్యంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగా నెహ్రూ ప్రభుత్వం జమీందారీ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి వారి ప్రయోజనాలకు భంగం లేకుండా కాపాడింది. 1950లో కాంగ్రెస్ ప్రభుత్వం భూ పరిమితి విధానాలు ముందుకు తెచ్చింది. మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో భూములకు గరిష్ఠ పరిమితి విధిస్తానని చెప్పి ఐదు సంవత్సరాల తర్వాత మూడు కుటుంబాల పరిధి పరిమితిగా విధించింది. ఇలాంటి సీలింగ్ వలన పేదలకు భూమి పంపిణీ జరగలేదు. 1954లో మరలా చట్టానికి సవరణలు చేసి, ఒక్కో కుటుంబానికి 27నుంచి 108 ఎకరాల మాగాణి, 164 ఎకరాల నుంచి 324 ఎకరాల మెట్ట భూములను గరిష్ఠ పరిమితిగా విధించింది. చట్ట సవరణలు ముందుగానే భూస్వాములకు పాలకులు చేరవేయటం వలన వారు జాగ్రత్తలు పడి భూములు కాపాడుకున్నారు. ఫలితం.. పేదలకు భూములు దక్కలేదు. పేదల భూ పోరాటాలు కొనసాగుతున్న నేపథ్యంలో 1958లో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త భూ పరిమితి ముసాయిదాను ప్రవేశపెట్టి 1961లో దాన్ని చట్టంగా మార్చింది. ఈ చట్ట నిబంధనల సమాచారం కూడా ముందుగానే భూస్వాములకు చేరటం వల్ల వివిధ మార్గాల ద్వారా చట్ట పరిధిలోకి రాకుండా భూములు కాపాడుకున్నారు. శ్రీకాకుళం, నక్సల్‌బరీ గిరిజన రైతాంగ పోరాటాలు మరోసారి భూమి సమస్యను ముందుకు తెచ్చాయి. శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజనుల భూమి హక్కుల కోసం 1/70 చట్టం చేసింది. భూపోరాటాలు తిరిగి ఉధృతం కావటంతో భూపరిమితిని మరోసారి కుదిస్తూ 1970 మే 25న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ 10 ఎకరాల మాగాణి, 25 ఎకరాల మెట్టగా పేర్కొంది. 1973లో ఆ ఆర్డినెన్స్ చట్టంగా మారింది. అసెంబ్లీ ఆమోదం పొందినా 1975 జనవరిలో గాని అమల్లోకి రాలేదు. ఈ భూ పరిమితి చట్టం ద్వారా మొదట 18లక్షలకు పైగా మిగులు భూములు ఉన్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అనేకసార్లు దాన్ని కుదిస్తూ చివరికి 6.47 లక్షల ఎకరాలుగా పేర్కొంది. అందులో 5.82లక్షల ఎకరాలను 4.79 లక్షల మందికి పంపిణీ చేసినట్లు చెప్పింది. భూ సీలింగ్ ద్వారా స్వాధీనం చేసుకున్న భూస్వాముల భూములు వేళ్ల మీద లెక్కించవచ్చు. పేదలకు పంచామని చెబుతున్న భూములు కూడా సంఘ నిర్మాణం ద్వారా పేదలు సాధించుకున్నవే 90 శాతం ఉన్నాయి. దీన్ని గమనిస్తే అర్ధ ఫ్యూడల్ వ్యవస్థ రద్దు కర్తవ్యాలను దేశీయ పాలకులు వదిలివేశారని వెల్లడౌతున్నది. భూ సంస్కరణల చట్టాల అమలు తీరుతో భూస్వామ్య వర్గాలకు ఎటువంటి నష్టం కలగలేదు. వారి భూములు యథాతథంగా వారి స్వాధీనంలోనే ఉన్నాయి. భూ సంబంధాల్లో మౌలిక మార్పులు చోటు చేసుకోలేదు. భూ కేంద్రీకరణ తగ్గలేదు. భూమి లేని పేదల సంఖ్య పెరుగుతూనే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల పట్టు కొనసాగుతూనే ఉంది. భూ వనరుల శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించిన భూ సంస్కరణల జాతీయ విధానం- ముసాయిదా 18 జూలై, 2013 భూ సంబంధాలపై స్పష్టత ఇచ్చింది. 2013 ముసాయిదాలో పర్యావరణం, అటవీ శాఖ గణాంకాల ప్రకారం భారతదేశంలో 47 శాతం భూమి వ్యవసాయానికి అనువైనది. 22.6 శాతం భూమి అడవుల కింద, 13.6 శాతం భూమి సాగుకి ఉపయోగపడనిదిగా ఉంది. భారతీయ గ్రామీణ అభివృద్ధి నివేదిక 1992 ప్రకారం దేశ గ్రామీణ జనాభాలో సగానికి పైగా అసలు భూమే లేదు. జాతీయ నమూన సర్వే ప్రకారం (2003-04) 41.63 శాతం కుటుంబాలకు ఇంటి స్థలం తప్ప, సొంత భూమి లేదు. నామమాత్రంగా భూమి ఉన్నవారు మూడింట ఒక వంతు ఉన్నారు. 20 శాతం మందికి ఒక హెక్టార్ కంటె తక్కువ భూమి ఉంది. ముఖ్యంగా దేశ జనాభాలోని 60 శాతానికి మొత్తం భూమిలో ఐదు శాతం మాత్రమే భూమి ఉంటే, పది శాతం మంది చేతుల్లో 55 శాతం పైగా ఉంది. ఈ లెక్కలను గమనిస్తే భూమి కేంద్రీకృతమైన తీరు, భూమి లేని పేదల సంఖ్య, అర్ధ భూస్వామ్య వ్యవస్థ కొనసాగుతున్న విధానాన్ని తెలుపుతోంది. పాలక ప్రభుత్వాలే దేశంలో అర్ధ ఫ్యూడలిజం, భూ కేంద్రీకరణ ఉందని చెబుతుంటే, కొందరు ఎన్‌జీఓల ఏజంట్లు, మాజీ విప్లవకారులు, పాలకవర్గాల భట్రాజులు దేశంలో భూస్వామ్య విధానం అంతరించిందని, భూ కేంద్రీకరణ లేదని ప్రచారం చేయటం పేదలను పక్కదారి పట్టించే ప్రయత్నమే. కౌలు సేద్యం ఉందంటేనే భూస్వామ్య విధానం కొనసాగుతున్నదని అర్థం. దేశంలో 50శాతానికి పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 60 శాతానికి పైగా కౌలు సేద్యం కొనసాగుతున్నది. కౌలు విధానం భూస్వామ్య వ్యవస్థ అంతర్భాగం. భూస్వామ్య దోపిడీకి ముఖ్యమైనది. దేశంలో అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ సుదీర్ఘ కాలంగా కొనసాగుతుండటం, భూస్వామ్య వర్గంతో సామ్రాజ్యవాదం, బడా బూర్జువా వర్గం మిలాఖత్ కావటం వల్ల వ్యవసాయ రంగంలో సహజంగానే కొన్ని మార్పులు వచ్చాయి. పంటల మార్కెటింగ్, కుటుంబ అవసరాల కోసం మిగులు ఉత్పత్తి, సేద్యంలో యంత్రాల వినియోగం అందులో భాగమే. ఇవేవి వ్యవసాయం పెట్టబడి విధానంలోకి మళ్లిందని చెప్పటానికి కారణాలు కావు. అలా ప్రచారం చేసే వారి అవగాహన లోపాన్ని తెలియ చేస్తున్నది. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు భూస్వామ్యవర్గ ప్రయోజనాలు కాపాడుతూ, సామ్రాజ్యవాద, కార్పొరేట్ సంస్థల ఎరువుల, పురుగు మందుల, విత్తనాల వ్యాపారానికి, ట్రాక్టర్లు, కోత మిషన్ల మొదలైన వాటి వ్యాపారానికి నిలయంగా ఉన్నాయి. భూ సంబందాల్లో విప్లవాత్మక మార్పులు రాకుండా, దేశం పారిశ్రామిక వంతం కాకుండా వ్యవసాయ రంగం పెట్టుబడిదారీ విధానంలోకి మార్పు చెందటం జరగదు. దేశం పారిశ్రామికంగా వెనకబడి ఉంది. అర్ధ ఫ్యూడల్ సంబంధాల్లో మౌలిక మార్పులు జరగలేదు. వ్యవసాయంలో వచ్చిన మార్పుల ద్వారా సేద్యాన్ని సంక్షోభంలోకి నెట్టి కార్పొరేట్ సంస్థలకు చిన్న, సన్నకారు రైతుల భూములు కట్టబెట్టే విధానాలు పాలకులు అనుసరిస్తున్నారు. భూమి సంబంధాలతో పాటు, ఫ్యూడల్ సంస్కృతి వికృత రూపంలో కొనసాగుతున్నది. మత ప్రచారాలు, దైవత్వం, యజ్ఞాలు, మూఢనమ్మకాలు, మఠాధిపతులు, స్వాములు, అతీతశక్తులు, పాములు-చెట్లను పూజించటం నేడు పెద్దఎత్తున కొనసాగుతున్నది. ఈ సంస్కృతిని పాలకులు పెంచి పోషిస్తున్నారు. మోదీ ప్రభుత్వం స్వయంగా ఫ్యూడల్ సంస్కృతిని అమలు జరుపుతున్నది. ఇది ఫ్యూడల్ వ్యవస్థ రూపం. నేటి అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ పతనమైతేనే అన్ని రకాల ఫ్యూడల్ బంధనాల నుంచి ప్రజలు బయటపడతారు. అందుకు భూస్వామ్య వ్యవస్థను బద్దలు కొట్టే విప్లవాత్మక భూ సంస్కరణలకై ప్రజలు ఉద్యమించి, నూతన ప్రజాతంత్ర వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.

# జోహార్ పెరియార్ రామస్వామి

ప్రజలకు స్వాతంత్రం వచ్చిందంటే నేను ఒప్పుకోను స్వాతంత్రం పేరుతో అధికారం తెల్లదొరల నుంచి నల్లదొరలకు సంక్రమించింది అన్న సత్యం ప్రజలకు చాటి చెప్పిన మహోన్నతమైన వ్యక్తి పెరియార్ రామస్వామి ట ఈరోడ్ వేంకట రామస్వామి నాయకర్ఊ నేడు ఆ మహానుభావుడు జన్మదిన శుభ సందర్భంగా ఆయన గురించి కొన్ని విషయాలు నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్వపు మద్రాసు ప్రెసిడెన్సీలోని ఈరోడ్ పట్టణంలో 1879 వ సంవత్సరం సెప్టెంబర్ 17 వ తారీఖున జన్మించారు. ఈయన పెరియార్ గా, తండై పెరియార్ గా, రామస్వామిగా, ఇ.వి.ఆర్.గా కూడా సుప్రసిద్ధులు. వీరి పూర్వీకులు విజయనగర సామ్రాజ్యం కర్ణాటక నుండి తమిళనాడు వచ్చినారు. మదుర, తంజావూరు రాజ్యాదీశులుకు బంధువర్గీయులు, చంద్రవంశ బలిజలుగా పేరున్నవారు. వీరి తండ్రి ప్రముఖ వ్యాపారి వెంకట నాయక్కర్. ఈరోడ్ వేంకట రామస్వామి నాస్తికవాది మరియు సంఘ సంస్కర్త. తమిళనాడు లో ఆత్మగౌరవ ఉద్యమం మరియు ద్రావిడ ఉద్యమ నిర్మాత. దక్షిణ భారతీయులను రాక్షసులుగా, వానరులుగా చిత్రీకరించిన రామాయణాన్ని, రాముడిని ఈయన తీవ్రంగా విమర్శించాడు. 1904లో ఈయన కాశీ లోని విశ్వనాథుడి దర్శనార్థం వెళ్ళినపుడు అచట జరిగిన అవమానంతో ఈయన నాస్తికుడిగా మారాడు. అప్పటినుండి హేతువాదిగా మారి హిందూ మతాన్ని అందులోని కులవ్యవస్థను అసహ్యించుకున్నాడు. మరీ ముఖ్యంగా బ్రాహ్మణ వర్గాన్ని ద్వేషించాడు. హిందూమతములోని వర్ణవ్యవస్థని తీవ్రంగా అసహ్యించుకుని, వైదిక ధర్మానికి వ్యతిరేఖంగా నాస్తికత్వాన్ని విశేషంగా ప్రచారం చేసి అనేక మంది అనుచరులను సంపాదించుకున్నాడు. ఈయన 1919 నుండి 1925 వరకు కాంగ్రెస్ పార్టీలో ఉండి దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడాడు. తదనంతర కాలంలో ఈయన మరియు ఇతని అనుచరులు దేశ స్వాతంత్రం కన్నా సాంఘిక సమానత్వం కొరకు ఎక్కువగా పోరాడారు. అన్నికులాలవారికీ సమానంగా దేవాలయ ప్రవేశార్హత ఉండాలని వాదించారు. 1937 వ సంవత్సరంలో రాజాజీ నేతృత్వంలోని మద్రాస్ ప్రెసిడెన్సీ కాంగ్రెస్ ప్రభుత్వం హిందీ భాషను మద్రాను రాష్ట్ర పాఠశాలల్లో ప్రవేశపెట్టినపుడు పెరియార్ తన జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో హిందీ వ్యతిరేకోద్యమాన్ని పెద్దయెత్తున చేపట్టి చివరికి హిందీ బోధనను విరమింపచేశాడు. తమిళనాట ద్రావిడోధ్యమం, తమిళజాతీయ వాదం ప్రధానమైనవి. ఇవి రెండు తమిళరాజకీయాలను శాసిస్తున్నాయి. పెరియార్ రామస్వామి నాయకర్ వీటికి మూలపురుషుడు దక్షిణ భారతదేశం ద్రావిడ ప్రాంతమని, ఇక్కడ నివసించేవారు ద్రావిడులని, గంగాసింధూ, మైదాన ప్రాంతం నుండి వలసవచ్చిన ఆర్యులు ఉత్తరాదివారని, తమిళమే అతిప్రాచీన భాష అని, ఇది సంస్కృతం కంటే పురాతనమైనదని, తమిళులు ఉత్తరాదివారి నుండి తమిళాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చి, అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. పెరియార్ ప్రభావం ఆనాటి సమాజంపై విశేషమైన ప్రభావం చూపింది. ఇతని అనుచరులు, రాజకీయ నాయకులు ఇతడి సిద్దాంతాలను వాడుకుని, ద్రావిడ భావజాలాన్ని, తమిళజాతీయోద్యమాన్ని తారాస్థాయికి చేర్చారు. తరువాత ఈయన పార్లమెంటరీ రాజకీయాల మీద విశ్వాసం కోల్పోయి జస్టిస్ పార్టీని ద్రావిడర్ కళగం అనే సామాజికోద్యమ సంస్థగా మార్చాడు. దీనినుండే తమళనాడు లోని చాలా పార్టీలు ఉద్భవించాయి. రాజకీయాలవైపు మొగ్గుచూపిన కొందరు అనుచరులు ఆయన నుండి విడిపోయి అన్నాదురై



నాయకత్వంలో ద్రవిడ మున్నేట్ర కళగం (డి.యమ్.కె.) అనే పేరుతో కొత్త పార్టీ ప్రారంభించారు. ఆ తదుపరి 1969 లో అన్నాదురై మరణం తర్వాత కరుణానిధి నాయకత్వంతో విభేదించిన యమ్.జి.రామచంద్రన్ డి.యమ్.కె. నుండి విడిపోయి అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఎ.ఐ.ఎ.డి.యమ్.కె.) అనే పేరుతో మరో పార్టీ స్థాపించారు. ఈ రెండు పార్టీలే అప్పటి నుండి నేటివరకు తమిళనాడు రాజకీయాలను శాసిస్తున్నాయి

# బానిసత్వపు ఆలోచనలకు చరమగీతం

బ్రిటిష్ వలసవాదం నుంచి మనకు విముక్తి లభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భారతదేశం స్వాతంత్ర్య అమృత మహోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నాము. ఈ సందర్భంగా ఆగస్టు 15న, స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోటనుంచి యావద్దేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ 'పంచ ప్రణ్' (ఐదు ప్రతిజ్ఞలు) గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి భారతీయుడు ఈ ఐదింటిని పాటిస్తే వచ్చే 25 ఏళ్లలో (దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే అమృత కాలం నాటికి) భారతదేశం 'విశ్వగురు'గా అభివృద్ధి సాధించడాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఈ ఐదు ప్రతిజ్ఞల్లో ఒకటి మనలోని బానిసత్వపు ఆలోచనలను నిర్మూలించుకుని మన దృక్పథాన్ని మార్చుకోవాలని సూచించారు. 'వందల ఏళ్లనాటి బానిసత్వం మన ఆలోచనల్లో వికృతిని పెంచి పోషించింది. మన మనసులో, మన అలవాట్లలో, ఏ మూలనైనా ఆ ఆనవాళ్లుంటే దాన్ని వెంటనే తుడిచేయాలి. ఇతరుల్లా ఉండేందుకు మనం ప్రయత్నించాల్సిన పనిలేదు. ప్రపంచం నుంచి మనకు ధ్రువీకరణ అవసరం లేదు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతదేశానికి ఉన్న శక్తి సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటే ఏదైనా సాధించవచ్చని, కానీ ఈ బానిసత్వపు ఆలోచనలే మన సామర్థ్యానికి అడ్డుగా నిలుస్తున్నాయన్నది ప్రధానమంత్రి ఆలోచన. అన్నింటినీ స్వీకరించాలని చెబుతున్న మన నాగరిక విలువల కారణంగా అవసరమైన, అసలైన చర్చను బహిరంగంగా, నిజాయితీగా జరిపేందుకు మనం తటపటాయిస్తున్నాం. కాలక్రమేణా ఇది మనల్ని గత చరిత్రను విస్మరిస్తూ వాస్తవాలను కూడా గుర్తించలేని భ్రమల్లోకి తీసుకెళ్లింది. ఈ దృక్కోణంలోనే హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని కూడా చూడవచ్చు. భారతదేశం ఆంగ్లేయుల పాలన నుంచి ఆగస్టు 15, 1947న స్వతంత్రమైనప్పటికీ నాటి హైదరాబాద్ సంస్థానం మాత్రం స్వేచ్ఛావాయువులు పీల్చేందుకు దాదాపు 13 నెలలు పట్టింది. ఉక్కు మనిషి, నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేకమైన చొరవతీసుకుని హైదరాబాద్‌పై పోలీసు చర్యకు ఉపక్రమించారు. సంస్థాన ప్రజలూ సర్వస్వాన్నీ త్యాగం చేస్తూ పోరాడారు. ఈ కారణాల ఫలితంగా నిజాం అరాచక పాలననుంచి ప్రజలకు విమోచన లభించింది. తెలంగాణలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకునేందుకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 75 ఏళ్లు పట్టింది. ఇది అత్యంత దౌర్భాగ్యకరమైన పరిస్థితి. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ఈ ఉత్సవాలను ఏడాదిపాటు ఘనంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిశ్చయించడం, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాని ముఖ్య అతిథిగా, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులను విశిష్ట అతిథులుగా ఆహ్వానించడం జరిగింది. మన తెలంగాణ కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన కొమురం భీం, రాంజీ గోండు, తుర్రేబాజ్ ఖాన్, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచంద్రరావు, నారాయణ రావ్ పవార్, దొడ్డి కొమురయ్య, చిట్యాల ఐలమ్మ, దాశరథి సోదరులు, కాళోజీ నారాయణ రావు, పీవీ నరసింహారావు వంటి ఎందరో మహానుభావులను స్మరించుకునేందుకు ఇదొక సరైన సమయం. ఏడాదిపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించి ఇలాంటి ఎందరో పోరాట యోధులను గురించి గుర్తుచేసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. పెరుగుతున్న సాంకేతికత ద్వారా పెద్దల త్యాగాలను తర్వాతి తరాలకు అందజేసేలా అనేక ప్రణాళికలకు రూపకల్పన జరుగుచున్నది. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరుపుకోలేకపోవడానికి కారణం పూర్తిగా రాజకీయ పరమైన దివాళాకోరుతనమే. ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమిన్ (మజ్లిస్) పార్టీని సంతుష్టిపరిచేందుకు అధికారంలో ఉన్న రాజకీయపార్టీలు పనిచేస్తున్నాయి. తద్వారా మన ఘనమైన చరిత్రకు గండికొట్టేందుకు కూడా ఈ పార్టీలు వెనుకాడటం లేదు. హైదరాబాద్ సంస్థానంలో అరాచకాన్ని సృష్టించిన ఖాసీం రజ్వీ, లక్షా 50వేల మంది మజ్లిస్ వాలంటీర్లతో రజాకార్ సైన్యాన్ని ఏర్పాటుచేయడం, ఈ రజాకార్లు గ్రామాల్లో విధ్వంసం, అరాచకం, దోపిడీ, హత్యాకాండ చేయడం, మహిళలపై అత్యాచారాలు, పురుషులను చంపడం ఇవన్నీ తర్వాతి తరానికి తెలియజేయకుండా ఉండేందుకు పాలకపార్టీలు తమవంతుగా పనిచేశాయి. చరిత్రను విస్మరించిన జాతి ముందడుగేయడం కష్టమన్న సామాన్యమైన అంశాన్ని కూడా రాజకీయ అవసరాల కోసం పణంగా పెట్టాయి. బైరాన్‌పల్లి ఘటనకు ఇప్పటికీ అక్కడి బురుజులు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వందలమందిని నిలబెట్టి రజాకార్లు పిట్టలను కాల్చినట్లు కాల్చారు. ఆ గ్రామాన్ని లూటీ చేసి తమ వికృతరూపాన్ని ప్రదర్శించారు. వరంగల్ జిల్లాలోని పరకాల ప్రజలు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని త్రివర్ణ పతాకాన్ని ఎగరేస్తే నిజాం, రజాకార్లు జీర్ణించుకోలేక హత్యాకాండకు పాల్పడిన చరిత్ర నేటి యువతకు తెలవాల్సిన అవసరం ఉంది. రంగాపురం గ్రామంలో ప్రజలను చెట్టుకు కట్టేసి కాల్చడం, లక్ష్మీపురంలో మహిళలపై అత్యాచారాలు చేసి బంగారాన్ని, ధనం, ధాన్యాన్ని లూటీ చేయడం వంటి ఘటనలు, రజాకార్ల ఆకృత్యాల గురించి నేటి తరానికి తెలియాలి. ఈ ఘటనలను దక్షిణ భారత జలియన్ వాలాబాగ్ ఘటనగా మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు వర్ణించారు. నిర్మల్‌లో ఆ ప్రాంతంలో నిజాం రాక్షస పాలనకు అడుగడుగునా అడ్డుపడుతున్న రాంజీ గోండు, ఆయన అనుచరులు వెయ్యిమందిని మర్రి చెట్టుకు ఉరితీసిన నిజాం దుర్మార్గాల గురించి కూడా తెలంగాణ భవిష్యత్తయిన విద్యార్థులకు తెలవాల్సిన అవసరం ఉంది. అందుకే నాటి హైదరాబాద్ సంస్థానంలోని ప్రాంతాల్లో నిర్వహించే కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరికీ నిజాం పాలనలోని వాస్తవాలను తెలియజేస్తూ, వారి అరాచక పాలన నుంచి విమోచనం కోసం మన పెద్దలు చేసిన పోరాటాన్ని వివరిస్తూ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతోనే కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ విషయాలన్నీ తెలిస్తే, తెలంగాణ విమోచన దినోత్సవం జరపాల్సిన అవసరమేంటనేది ప్రజలకు అర్థమయితే, తమ రాజకీయ కుట్రల గురించి అందరికీ తెలిసిపోతుందని అనేక సంవత్సరాలుగా పాలకపార్టీలు భావిస్తున్నాయి. అందుకే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయి ఎనిమిది సంవత్సరాలు గడిచినా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకునేందుకు ఇష్టపడటం లేదు. ఇతర రాజకీయ పార్టీలు కూడా విమోచన దినాన్ని జరుపుకునే విషయంలో అర్థంలేని ప్రకటనలు చేస్తున్నాయి. సెప్టెంబర్ 17ను విమోచన దినంగా జరుపుకోవడం నిజాంను అవమానించడం అవుతుందని, ఇది ముస్లిం సమాజానికి ఆగ్రహం కలిగిస్తుందని కొందరు మాయమాటలు చెబుతున్నారు. ఈ సంతుష్టీకరణ ఆలోచనలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. కానీ వీళ్లతో పాటు ప్రజలంతా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, నిజాంకు వ్యతిరేకంగా చాలా మంది ముస్లింలు పోరాడారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు 'ఇమ్రోజ్' పత్రికను స్థాపించి, నిజాం కంటిమీద కునుకులేకుండా చేసిన షోయబుల్లాఖాన్‌ను రజాకార్లే క్రూరాతిక్రూరంగా చంపించిన సంగతిని మనం గుర్తుచేసుకోవాలి. విమోచన దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా కుల, మతాలకు అతీతంగా నిజాం, రజాకార్లపై పోరాటం చేసిన వీరులందరినీ స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. వీరందరి కృషి కారణంగానే తెలంగాణ, భారతదేశంలో విలీనమైంది. మన గడ్డమీద త్రివర్ణపతాకం ఎగిరింది. మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయి. అందుకే మన స్వాతంత్ర్యానికి 75 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో 2022, సెప్టెంబర్ 17 నుంచి 2023 సెప్టెంబర్ 17 వరకు ఏడాది పొడగునా ఘనంగా మన వీరులను సంస్మరించుకునే కార్యక్రమాలు చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బానిసత్వపు ఆలోచనలను విడనాడి మన వాస్తవ చరిత్రను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో కేంద్రం విస్తృతమైన కార్యక్రమాలు చేపడుతోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో దేశ స్వాతంత్ర్యం కోసం, అరాచక పాలననుంచి విముక్తి కోసం పోరాడిన వారి త్యాగాలను యావద్దేశానికి పరిచయం చేయడమే 'ఆజాదీ కా అమృత్ మహోత్సవాల' లక్ష్యం. 1948లో నాటి హోంమంత్రి సర్దార్ పటేల్ హైదరాబాద్ వేదికగా జాతీయ పతాకాన్ని ఎగరేసిన 74 ఏళ్ల తర్వాత మళ్లీ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విమోచన ఉత్సవాలను చేపట్టడం జరిగింది. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రస్తుత హోంమంత్రి అమిత్ షా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఈ కార్యక్రమం మన గతాన్ని స్మరించుకుంటూ పోరాటయోధుల స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన అవసరాన్ని మనకు గుర్తుచేస్తుంది. అందుకే ఈ సెప్టెంబర్ 17న మనమంతా ఆత్మగౌరవంతో త్రివర్ణ పతాకాలను ఎగరేద్దాం. మనలోని బానిసత్వపు ఆలోచనలకు, ఓటుబ్యాంకు రాజకీయాలకు చరమగీతం పాడదాం.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణాన్ని తీర్చిదిద్దుతాం:ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ సెప్టెంబర్ 16ప్రజా పాలన ప్రతినిధి: పట్ట ణంలోని సీఎం రోడ్డు విస్తరణ -అభివృద్ధి పనులలో భాగంగా రూ.38 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో నందిగామ పట్టణానికి ప్రత్యేక నిధులు కేటాయించి పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని , అందు లో భాగంగానే పట్టణంలో రోడ్ల నిర్మాణం -సిసి డ్రైన్ ల నిర్మాణాలు - ఇంటింటికి కుళాయి నిర్మాణ పనుల ను చేపట్టి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసు కుంటున్నామన్నారుముఖ్యంగా పట్టణీకరణలో భా గంగా సీఎం రోడ్డు విస్తరణ -అభివృద్ధి పనులు చేప ట్టాలని , రోడ్డు విస్తరణకు సహకరించిన సీఎం రోడ్డు నివాసితులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు ,పట్టణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే పట్ట ణంలో అభివృద్ధి పనులు చేపట్టామని ,సీఎం రోడ్డులో ఇప్పటికే ఇరువైపులా పక్కా డ్రైనేజీలు ,విద్యుత్ దీ పాలంకరణ పనులు పూర్తయ్యాయని - సీఎం రోడ్డు ను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు , త్వరలోనే నగర పంచాయతీ గ్రేడ్-2 ము న్సిపాలిటీగా అప్ గ్రేడ్ అవుతుందని త ద్వారా మరిం త అభివృద్ధి జరగడానికి ప్రత్యేక నిధు లు మంజూరు అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ,ఏఈ ,నగర పంచాయతీ కౌ న్సిల్ సభ్యులు ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదానీలు, అంబానీలు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రజలపై భారాలను మోపుతున్న కేంద్ర ప్రభుత్వ విధా నాల్ని తిప్పికొట్టండి: సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణ



నందిగామ సెప్టెంబర్ 16 ప్రజాపాలన ప్రతినిధిప్రత్యేక హోదా విభజన హామీల అమలుల్లో రాష్ట్రాన్ని దగా చేసిన మోడీ సర్కారును నిలదీయాలని డివి కృష్ణ పిలుపునిచ్చారు. గాంధీ సెంటర్ లో కరపత్రాల పంపి ణీ చేస్తూ ఆయన మాట్లాడుతూ8 సంవత్సరాల బి జెపి మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అధోగతి పాలయిందని నిత్యవసర వస్తువులు ధరలు చుక్కలు అంటుతున్నాయి బియ్యం పాలు నూనెలు పప్పు ది నుసులతో సహా అన్ని వస్తువులు పైన జీఎస్టీ పేరుతో భారం మోపారువంట గ్యాస్ సిలిండర్ ధర 1100 దా టింది పెట్రోల్ డీజిల్ రేట్లు ఇష్టారాజ్యంగా పెంచి 27 లక్షల కోట్ల ప్రజల నెత్తిపై రుద్దారుప్రభుత్వ రంగ సం స్థలైన రైల్వే ఎల్ఐసి బ్యాంకింగ్ బిఎస్ఎన్ఎల్ తో స హా అన్నిటిని ప్రైవేటీకరించి కార్పొరేట్లకు కట్టబెడుతు న్నారుఆదానీలు అంబానీలకు కోర్టు విమానాశ్రయా లు టెలికాం విద్యుత్తు ఇలా ఒక్కొక్కటి దార దత్తం చే స్తున్నారుబడా కార్పొరేట్లకు 10 కోట్ల రూపాయలు రు ణమాఫీ చేశారుచిన్న మధ్య తరగతి పరిశ్రమలని దె బ్బతీశారన్నారుఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్య క్షులు సోమేశ్వరావు సైదులు నందిగామ కార్యదర్శి కే గోపాల్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం కర్రి వెంకటే శ్వరావు జి గోపి నాయక్ ఎం శ్రీనివాసరావు బచ్చుల కూర లాజర్ పాల్గొన్నారు

## గూడాల వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు మంగం సూర్యనారాయణ ఆకస్మిక మృతి



అమలాపురం( ప్రజా పాలన): అల్లవరం మండలం గూడాల గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగం సూర్యనారాయణ శుక్రవారంఆకస్మికంగా మృతి చెందారు.ఈ వార్త గూడాల గ్రామం అంత విషయ ఛాయలు నెలకొంది. మరణ వార్త తెలిసిన వెంటనే స్థానిక గ్రామ సర్పంచ్ దాకారపు చిరంజీవి రావు వెళ్ళి మంగం సూర్యనారాయణ పార్థివ దేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గూడాల గ్రామానికి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు నివాళు అర్పించి అధిక సంఖ్యలో అంత్యక్రియలకు పాల్గొన్నారు



బాపట్ల జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: సెప్టెంబర్.16 :అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు.

## భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి



చింతలపూడి,ప్రజాపాలన ప్రతినిధి : భారతీయ జనతా పార్టీ చింతలపూడి అర్బన్ మరియు రూరల్ మండల సమావేశం చింతలపూడి టౌన్ అధ్యక్షులు సిరంగి ప్రసాద్ మరియు రూరల్ మండల అధ్యక్షులు తాడిపర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో చింతలపూడిలో మండల కార్యాలయంలో బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ యొక్క చింతలపూడి నియోజకవర్గ కో కన్వీనర్ దిడ్ల అంజిలోన , బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ తోట వెంకటనారాయణ పాల్గొని భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు రూరల్ మండలాలలో ఘనంగా నిర్వహించుటకు ప్రణాళిక సిద్ధం చేశారు.ఈ సందర్భంగా అంజిలోన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మరియు ఏలూరు జిల్లా బిజెపి అధ్యక్షులు కురెళ్ళ సుధాకర్ కృష్ణ మరియు స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ల కన్వీనర్ చౌటుపల్లి విక్రమ్ కిషోర్ సూచనల మేరకు ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నామని, ప్రధాని నరేంద్ర మోడీ జన్మ దిన వేడుకలను ఈనెల 17వ తారీకున భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత పండ్లు పంపిణీ కార్యక్రమం స్వచ్ఛభారత్ మొక్కల నాటే కార్యక్రమం పలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చింతలపూడి రూరల్ మండల ప్రధాన కార్యదర్శులు కనమాల లక్ష్మీ బాబు , పొదిలి రఘురాం, చింతలపూడి అర్బన్ జనరల్ సెక్రెటరీ మాలెంపాటి రవీంద్ర మరియు మర్రి రాంబాబు, బిజెపి నాయకులు నాగుబండి గోపాలకృష్ణ, బిజెపి జిల్లా మహిళా నాయకురాలు టి శ్యామలాదేవి, మహమ్మద్ అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలగుప్తం ఎంపీపీ భర్త దంగేటి రాంబాబును అరెస్ట్ చేయాలని డిమాండ్




అమలాపురం( ప్రజా పాలన) ఉప్పలగుప్తం మండలం వైస్సార్సీపీ ఎంపీపీ భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న పంచాయతీ సెక్రటరీ రొద్ద భవాని మృతికి కారకుడైన దంగేటి రాంబాబును అరెస్ట చేయకుండా ప్రభుత్వం కాపాడుతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షులు మానుపాటి గోవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు రొద్ద భవాని న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో 15వ రోజు జరుగుతున్న దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ %యా% ఎరుకల కులానికి చెందిన మహిళ కనుక ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అగ్రకులానికి చెందిన భూస్వామి ,రాజకీయ పలుకుబడి ఉన్న దంగేటి రాంబాబును రక్షిస్తున్నారనీ ప్రతిపక్షాలు కూడా కనీస మద్దతు ప్రకటించలేదు ఎలక్షన్ సమయంలో మా ఇళ్ల చుట్టూ తిరుగుతారు మా సమస్యలు మాత్రం వారికి పట్టవు కాబట్టి వచ్చే ఎలక్షన్లలో మా ఎస్టీ కులాల ఓటు బ్యాంకు విలువ అన్ని రాజకీయ పార్టీ లకి చూపిస్తామని ఈ సంఘటన గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి ఎస్టీ సోదరులకు సోదరీమణులు కూడా ఈ ప్రభుత్వం మా పట్ల చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తామని భవాని మృతికి కారుకుడైన ప్రధాని నిందితుడు దంగేటి రాంబాబును అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలోఉప్పలగుప్తం మండలం ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షులు కమ్మసత్తి సత్యనారాయణ, గాడ రమేష్ ,మానుపాటి రాంబాబు, మానుపాటి రమేష్, భారతి వాసు వి.సి.కె జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ ,పి.డి.ఎస్.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిరుపతి రావు డేవిడ్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు

## రెవెన్యూ అధికారులకు క్రీడా పోటీలు



బాపట్ల, ప్రజాపాలన: రెవెన్యూ అధికారులు, సిబ్బందికి పని ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించేందుకు రెవెన్యూ క్రీడా పోటీలు ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యవర్గ సభ్యులతో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ను మర్యాద పూర్వకంగా ఆయన కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఆఫీస్ సబ్ ఆర్డినేటర్ నుండి డిప్యూటి కలెక్టర్ స్థాయి అధికారుల వరకు ఈ పోటీల్లో పాల్గొనవచ్చున్నారు. ఇప్పటివరకు హైద్రాబాద్, వైజాగ్, చిత్తూరులో పోటీలు నిర్వహించామని, ఈ ఏడాది గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో నవంబర్ 11 నుండి 13 వరకు 6 వ రాష్ట్ర స్థాయి క్రీడలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రికెట్, కబడ్డీ, వాలిబాల్, లాంగ్ జంప్, టేబుల్ టెన్నిస్, వాకింగ్ రేస్, క్యారమ్స్, స్విమ్మింగ్ తదితర ఆటలు ఉంటాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనదలచినవారు అక్టోబర్ 25 లోగా తమ వివరాలను జిల్లా కార్యవర్గం ద్వారా రాష్ట్ర కమిటీకి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు మహబూబ్ బాషా, చీరాల, బాపట్ల, రేపల్లె డివిజన్ల అధ్యక్షులు బ్రహ్మయ్య, నెహ్రూ బాబు, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువులతో అధిక లాభం



బాపట్ల, ప్రజాపాలన: సేంద్రియ ఎరువుల వినియోగంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ వెల్లడించారు. కలెక్టరేట్ లోని జిల్లా సమీక్ష సమావేశ మందిరంలో శు క్రవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ శాఖ జేడి అబ్దుల్ సత్తార్ సమావేశానికి అధ్యక్షత వహించగా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకుని లాభ సాటిగా వ్యవసాయం చేయాలన్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయ పై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇ క్రాప్ బుకింగ్ పై అవగాహన కల్పించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోని రైతులకు మరింతగా మేలు చేసేందుకు కృషి చేయాలని కోరారు .ఈ సమావేశంలో రైతులు అడిగిన పలు ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు చెప్పారు. వచ్చే సమావేశం నాటికి రైతుల పక్షాన తీసుకున్న చర్యలపై నివేదికను తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. . ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, మత్స్య శాఖ జె.డి సురేష్ , ఎల్.డి.ఎం దాసరి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులు శ్రీకారం: ఎంపీ చింతా అనూరాధ



అమలాపురం( ప్రజా పాలన) :అల్లవరం మండలం గోడిలంక గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన బడి నాడు-నేడు ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు అమలాపురం పార్లమెంట్ సభ్యులు శ్రీమతి చింతా అనురాధ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీపీ ఇళ్ల శేషారావు, వైస్ ఎంపీపీ వడ్డీ గంగా, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, ఎండీవో, ఎమ్మార్వో, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, సర్పంచ్ లు వడ్డీ సుభాషిణి, రాపాక విజయలక్ష్మి, లక్ష్మీపతిరాజు, పల్లి జేమ్స్, బొమ్మి ఇజ్రాయిల్, నాతి శ్రీను, దత్తుడురాజు, కుడుపూడి శ్రీను, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీ నాయకులకు ప్రజలే త్వరలోనే తగిన బుద్ధి చెప్తారు: మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ సెప్టెంబర్ 16 ప్రజా పాలన ప్రతినిధి:తె లు గుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలో కే ష్ పై ఆర్కే రోజా చేసిన అనుచిత వ్యాఖలను ఖండి స్తూ మంత్రి మెరుగు నాగార్జున కొండెపి శాసనసభ్యు లు బాల వీర ఆంజనేయుల మీద అసెంబ్లీ లో చేసిన వ్యాఖలను ఖండిస్తూ నిరసన కార్యక్రమములో తెదే పా నేతలతో కలిసి నిరసన కార్యక్రమమంలో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొని మాట్లా డుతూ.నిన్న మంత్రి రోజా చంద్రబాబు మీద లోకేష్ బాబు మీద చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు ఇటువంటి మంత్రుల నుంచి గౌరవప్ర దమైన భాష ఆశించడం కూడా మనకు అత్యాస అ వుతుంది ఒక మహిళ అయ్యుండి గౌరవప్రదమైన ప దవిలో ఉండి స్థాయి మరిచి రోడ్లమీద తిరిగే మహి ళలాగా మాట్లాడటం చాలా విచారకరం అన్నారుతి రుపతి ఎంపీ ఎన్నికలు చూసాం ఎంత మంది దొంగ ఓటర్లను బస్సుల్లో తరలించారో ఎలా గెలిచారో రా ష్ట్రమంతా చూసింది.ఈ విధమైన గెలుపు చూసి ప్ర జాస్వామ్య గెలుపు అనుకోవడం వాపును చూసి బ లుపు అనుకోవడం చాలా హాస్యాస్పదంగా ఉంద న్నా రు మెరుగు నాగార్జున సాటి దళిత ఎమ్మెల్యే బాల వీరాంజనేయులుని అత్యంత అవమానకరంగా మా ట్లాడడం జరిగింది.ఒకరి పుట్టుక గురించి చావు గురిం చి చట్టసభల్లో మాట్లాడటం చాలా సిగ్గుచేటుఇది చట్ట సభలని అగౌరవ పరచడమే. నిన్న వీరాంజనేయులు గారిని దళితుడికే పుట్టావా అని నాగార్జున అనడం ఖండిస్తున్నామన్నారుఎప్పుడూ ఎన్నికలు వచ్చినా మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది చంద్రబాబు గారు ముఖ్యమంత్రి అవుతారు మళ్లీ ఈ రాష్ట్రాన్ని గాడిలో పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అభిమానులు కార్యకర్తలు ప్రజ లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోడెల వర్ధంతి



రాజుపాలెం, ప్రజాపాలన ప్రతినిధి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలంలోని న్యూ బోధనం గ్రామంలో కోడెల శివప్రసాద్ మూడో వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రాజుపాలెం మండల పార్టీ అధ్యక్షుడు అంచుల నరసింహారావు మాట్లాడుతూ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ చేసిన సేవలు మరులేనివని దేశంలోని చెప్పుకోదగిన నాయకుడని ఆయన ఆదర్శం తీసుకొని ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త ముందుకు సాగాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు అభిమానులు కలిసి రాజుపాలెం మండలం లోని ప్రతి గ్రామంలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ యొక్క వర్ధంతి ప్రోగ్రాం లో న్యూ బోధనం మాజీ సర్పంచ్ సైదారావు తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు..

## విభజన చట్టంలో ఏముందో సరిగా చూడండి:బుగ్గన



విజయవాడప్రజాపాలన ప్రతినిధి: ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా.. కడప స్టీల్‌ప్లాంట్‌పై టీడీపీ సభ్యులు ప్రశ్నలు సంధించారు. విభజన చట్టంలో స్పష్టంగా హామీ ఇచ్చారని...కడప స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రాన్ని ప్రభుత్వం ప్రశ్నించట్లేదని టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు అన్నారు. దీనిపై మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. టీడీపీ సభ్యులు సబ్జెక్టుకు కన్వైన్ కావడం లేదన్నారు. కడప స్టీల్ పెట్టేందుకు ఆలోచించొచ్చు అని ఉందన్నారు. కోవిడ్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా స్టీల్ ఇండస్ట్రీ బాగా దెబ్బతిన్నదని వెల్లడించారు. విభజన చట్టంలో ఏముందో సరిగా చూడాలని హితవు పలికారు. స్టీల్ ప్లాంట్ కోసం ప్రయత్నం చెయ్యొచ్చు అని మాత్రమే ఉందని.. MAY BE అని మాత్రమే ఉంది SHALLఅని లేదని బుగ్గన తెలిపారు. అనంతరం మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ.. 'విభజన చట్టం గురించి మాట్లాడుతున్నారు. నిజానికి రెండున్నర సంవత్సరాలు పాటు కోవిడ్ వల్ల ఆలస్యం అయ్యింది. ల్యాండ్‌కు సంభందించి ముప్పై ఏడున్నర కోట్లు కాంపన్సేషన్ చెల్లించాం' అన్నారు.

## దిల్లీ లిక్కర్ స్కామ్ హైదరాబాద్ లో మరోసారి ఈడీ సోదాలు




హైదరాబాద్,ప్రజాపాలన ప్రతినిధి: దిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 40 చోట్ల మరోసారి సోదాలు నిర్వహిస్తోంది.దిల్లీకి చెందిన ఈడీ అధికారుల ఆధ్వర్యంలో 25 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఈడీ అధికారులు ఇప్పటికే హైదరాబాద్‌లో రెండు సార్లు తనిఖీలు చేశారు.గతంలో కోకాపేట్‌లోని రామచంద్ర పిళ్లై నివాసం, నానక్‌రామ్‌గూడలోని రాబిన్ డిస్టలరీస్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. రాబిన్ డిస్టలరీస్, రాబిన్ డిస్ట్రిబ్యూషన్స్ ఎల్.ఎల్.పి. పేరుతో రామచంద్ర పిళ్లై కంపెనీలు నిర్వహిస్తున్నారు. తన సంస్థలో అభిషేక్ బోయిన్‌పల్లి, గండ్ర ప్రేమ్‌సాగర్‌రావును డైరెక్టర్లుగా ఆయన నియమించుకున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి హైదరాబాద్‌లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. అయితే ఈ సోదాలపై ఈడీ ఎలాంటి అధికారిక సమాచారం వెల్లడించలేదు.

## డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల వైఎస్సార్ సీపీ నుంచి ఎవరంటే..




అమరావతి,ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. శుక్రవారం సాయంత్రం వరకూ నామినేషన్ల స్వీకరణ సాగనుంది.వైఎస్సార్‌సీపీ నుంచి కోలగట్ల వీరభద్రస్వామి నామినేషన్ వేసే అవకాశం ఉంది.కోలగట్ల వీరభద్రస్వా మధ్యాహ్నం 3.30 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు సమాచారం. సోమవారం శాసనసభలో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుందని స్పీకర్ ఇదివరకే ప్రకటించారు. బలాబలాల రిత్యా డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

## గాలి జనార్ధన్ రెడ్డి సాక్షులను బెదిరిస్తున్నారు.. బెయిల్ రద్దు చేయాలి: సీబీఐ



దిల్లీ,ప్రజాపాలన ప్రతినిధి: అక్రమ మైనింగ్ కేసులో ఏ-2గా ఉన్న గాలి జనార్దన్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సీబీఐ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది.జనార్దన్‌రెడ్డి బళ్లారిలో ఉండేందుకు అనుమతిస్తూ గతేడాది ఆగస్టు 19న సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, బెయిల్ పొందినప్పటి నుంచి సాక్ష్యాధారాలను తారుమారు చేసే పనిలో ఉన్నారని, వెనువెంటనే గాలి జనార్దన్‌రెడ్డిని బళ్లారి నుంచి తరలించాలని, దాంతో పాటు బళ్లారి వెళ్లేందుకు ఇచ్చిన అనుమతులు, బెయిల్ రద్దు చేయాలని సీబీఐ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. గనుల కేసులో ప్రధాన సాక్షి శ్యామ్‌ప్రసాద్‌కు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని, గాలి జనార్దన్‌రెడ్డి నుంచి సందేశం వచ్చిందని సీబీఐ తెలిపింది. నిందితులు పదే పదే డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేస్తూ విచారణ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఈ సందర్భంగా సీబీఐ తెలిపింది. దీంతో విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోందని కోర్టు దృష్టికి తెచ్చింది.

## గ్రామ అభివృద్ధికి సహకరించాలి..: సర్పంచ్ మట్టా సత్యదేవి



రావులపాలెం,ప్రజాపాలన ప్రతినిధి: గ్రామ అభి వృద్ధికి అందరు కూడా సహకరించాలి గ్రామ సర్పంచ్ మట్టా సత్యదేవి కోరారు రావులపాలెం మండలం పరిధిలోని రావులపాడు గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ సత్యదేవి అధ్యక్షతనతో జరిగిన స్వచ్ఛత సేవ కార్యక్రమంలో అవగాహన సదస్సును నిర్వహించారు ఈ సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పర్చేందుకు సచివాలయం ఉద్యోగులు గ్రామ వాలంటిరీలు ఏ ఎన్ ఎంలు కలిసి కట్టుగా సమన్వయంతో పని చేయాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి .ఎమ్ ఎన్ .పట్టాభిరామయ్యా.పంచాయతీ పాలక వర్గ సభ్యులు. వైసీపీ నాయకులు మట్టా బాబ్జి, గెడ్డం కిషోర్,గ్రామ మహిళా పోలీస్.పంచాయతీ సిబ్బంది.గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# "కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలి"



అన్నమయ్య జిల్లా ప్రజాపాలన ప్రతినిధి:మనదేశంలో వ్యవసాయానికి ప్రత్యేక స్థానం ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్నటువంటి మొండి వైఖరి వలన రైతులు అదే విధంగా వ్యవసాయ రంగం కుదేలవడం జరుగుతుంది అని జిల్లా రైతు సంఘం నాయకులు మలిశెట్టి జతిన్ అన్నారు . రైతుల వల్ల అదే విధంగా వ్యవసాయ రంగం వల్ల మనదేశంలో పరోక్షంగా లక్షలాదిమంది ప్రజలకు ఉద్యోగ అవకాశాలు రావడం జరుగుతుంది. ఉదాహరణకు మన దేశంలో 80 నుంచి 85% కేవలం వ్యవసాయ రంగంలోనే ఉపయోగించే ట్రాక్టర్లు అదేవిధంగా రైతులు పండించిన టువంటి పంటను కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రవాణా కోసం 20 నుంచి 25 శాతం ఉపయోగించే లారీలు అదేవిధంగా వాటికి ఉపయోగపడేటటువంటి టైర్లు ,ఇంజన్ ఆయిల్, అదేవిధంగా వ్యవసాయ భూముల లో ఉపయోగించేటటువంటి స్టార్టర్లు , మోటార్లు , పైపులు, ఎరువులు , పిచికారి మందులు , యంత్రాలు తయారు చేసేటటువంటి కంపెనీల్లో లక్షలాదిమందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోంది దీనికి కేవలం రైతులు మరియు వ్యవసాయ రంగవే కారణం.అదేవిధంగా ఈ ట్రాక్టర్లు ,లారీలు, డీజిల్, టైర్లు, ఇంజన్ ఆయిల్ , టైర్లు, స్టాటర్లు ,మోటర్లు , పైపులు, ఎరువులు, పురుగులు మందులు , యంత్రాలు తదితర సామాగ్రిని విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి రైతులు మరియు వ్యవసాయ రంగం వలన టాక్స్ రూపంలో సంవత్సరానికి లక్షల కోట్లు ఆదాయం వచ్చేటటువంటి అవకాశం ఉంది.అదేవిధంగా రైతులు బ్యాంకు నుండి రుణాలు తీసుకొని ప్రతి సంవత్సరం వడ్డీ కడుతూ బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడుతూ మన ప్రభుత్వ ఆర్థిక అభివృద్ధికి చేయూతగా ఉన్నారు. కాబట్టి మన ప్రభుత్వం రైతులకు అదే విధంగా వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందిస్తూ ఉచిత విద్యుత్తు కొనసాగించాలి అదేవిధంగా ఎరువులు పైన పురుగులు మందులు పైన 85% రాయితీ ఇవ్వాలి.ఒకవేళ ప్రభుత్వం రైతులకు అదే విధంగా వ్యవసాయ రంగానికి సరైన ప్రోత్సాహం ఇవ్వకపోతే భవిష్యత్తులో పంట దిగుబడి తగ్గేటటువంటి అవకాశం ఉంది. దీనివలన వ్యవసాయానికి సంబంధించినటువంటి కంపెనీల ఉత్పత్తులు కొనలేని పరిస్థితి రావచ్చు. ఆ సమయంలో ఆ కంపెనీల్లో ఉద్యోగం చేసేటటువంటి లక్షలాదిమంది ఉద్యోగులు ఉద్యోగం కోల్పోయేటటువంటి ప్రమాదం ఉంది. దీనివలన మన దేశ ఆర్థిక పరిస్థితి అభివృద్ధి కుంటుపడేటటువంటి ప్రమాదం కూడా ఉంది అని జతిన్ అన్నారు .కాబట్టి ప్రభుత్వం ఆలోచించి రైతులకు అదే విధంగా వ్యవసాయానికి తగిన ప్రోత్సాహం ఇవ్వాలి. ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మలిశెట్టి వెంకటయ్య, రామాంజనేయులు, పెద్దన్న, వెంకటయ్య, నారాయణ, ప్రసాద్, ప్రహ్లాద, బాబు, రమణ, శంకరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామాల్లో పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ



రావులపాలెం,ప్రజాపాలన ప్రతినిధి: ఫుల్ర్టాన్ గ్రామ శక్తి రావులపాలెం వారి ఆధ్వర్యంలో గ్రామాల్లో మెడికల్ క్యాంపును నిర్వహిస్తూ ఉచిత సంచార వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నారు మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో స్థానిక పంచాయతీ వీధిలో గల శ్రీరామమందరం నందు గురువారం నాడు డాక్టర్ మౌనిక సిబ్బందితో కలిసిబీపీ. షుగర్ తదితరి పరీక్షలు ఉచితంగా వైద్య సేవలు నిర్వహించారు వారికి కావల్సిన మందులు మెడిసిన్స్ ఉచితంగా అందచేశారు ఈ సందర్భంగా ప్రాజెక్టు.కో ఆర్డినేటర్ ఎస్. రాంబాబు మాట్లాడుతూ ఫుల్ర్టాన్ గ్రామ శక్తి వారి సహాయ సహకారాలతో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు ఉమ్మడి గోదావరి జిల్లాలోని అటు నిడదవోలు ప్రాంతం వరకు ఇటు కోనసీమ ప్రాంతంలోని రాజోలు వరకు అనేక ప్రాంతాల్లో ప్రతీ ఊరులో వీరి ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉచితంగా క్యాంపులను పెట్టి పేద ప్రజలకు వైద్య సేవలతో పాటుగా మందులను అందజేస్తున్నామని రాంబాబు తెలిపారు ప్రతీ నెల ఈతకోట గ్రామంలోని పంచాయతీ వీధిలో క్యాంపును నిర్వహిస్తున్నామని మా యొక్క సేవలను ప్రజలు అందరు కూడా వినియోగించుకోవాలని ఆయన అన్నారు గ్రామంలో మహిళలు పెద్దలు యువకులు అనేకమంది వైద్య సేవలను వినియోగించుకుని మందులను తీసుకున్నారు క్యాంపులో వైద్య సేవలు అందిస్తున్న వారిని ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న సంస్థను గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి నాగేశ్వరరావు,గ్రామ మాజీ ఎంపిటిసి సభ్యుడు గండ్రోతు సత్యసూర్యనారాయణ(రాజు).వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ అధ్యక్షుడు గండ్రోతు వీరగోవిందరావు .యర్రంశెట్టి సత్యనారాయణ,తదితరులు ఈ సందర్భంగా వారి సేవల్ని అభినందించారు.

## ఆకలి అన్నవారి కడుపు నింపడమే మా నైజం

### టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు



ఆలమూరు,ప్రజాపాలన ప్రతినిధి: ఆకలి అన్నవారి కడుపు నింపడమే మా నైజం అని, పేదల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్ పెడితే వైయస్సార్సీపీకి ఎందుకు భయం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్లో అన్నా క్యాంటీన్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నం పెట్టే పార్టీ, రాష్టాన్ని అభివృద్ధి చేసే పార్టీ టీడీపీ అయితే సున్నం పెట్టే పార్టీ వైసిపీ అని బండారు వ్యాఖ్యానించారు. అన్నా క్యాంటీన్ పట్ల వైసీపీ వైఖరికి నిరసనగా ఆలమూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్క రోజు అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఐదు రూపాయలకే అన్నం పెట్టి ఆహారాన్ని పేదలకు అందుబాటులోకి తెచ్చింది చంద్రబాబు ప్రభుత్వమని, అటువంటి క్యాంటీన్ మూసివేయడం తగదన్నారు. రాష్ట్రంలో ఆహార భద్రతను ప్రభుత్వం ఇప్పటికే గాలికి వదిలేసిందని, అన్న క్యాంటీన్ లు మూసివేయడం తగదని ఆంధ్రులంతా గొంతెత్తి చాటుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అన్న క్యాంటీన్ తెరవాలని పేదలకు ఆహారాన్ని అందుబాటులోకి తేవాలని బండారు సత్యానందరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, మెర్ల గోపాలస్వామి, ఒంటిపల్లి సతీష్, కంఠంశెట్టి శ్రీనివాస్, గుత్తుల పట్టాభి, సయ్యపురాజు రామకృష్ణ రాజు, ధరణాల రామకృష్ణ, రామనుజుల శేషగిరిరావు, ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, ఈదల నల్ల బాబు, సిద్ది రెడ్డి పెద్దకాపు, కరుటూరి నరసింహారావు, చెల్లబోయిన సింహాచలం, గుత్తుల శీను, కప్పల సునీల్, తాడి శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి వెంకటరత్నం, దండంగి మమత రామారావు, వక్కభట్ల లక్ష్మణరావు, భావన శీను, కొమ్ము నారాయుడు, బళ్ల కృష్ణ, దొండపాటి సుబ్బరాజు, దున్నే స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ షాదీ తోఫా పేరుతో మరోసారి మైనార్టీలను జగన్ ప్రభుత్వం మోసం చేసింది



ప్రకాశం జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: ఎర్రగొండపాలెం నియోజకవర్గం, వైయస్సార్ షాదీ తోఫా పేరుతో మరోసారి మైనార్టీలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసింది అని ,టిడిపి ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ సమద్ భాష ,ధ్వజమెత్తారు గురువారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఊరూరు తిరుగుతూ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిపై తెలుగుదేశం ప్రభుత్వం పై అవాస్తవాలను చెప్పారని విమర్శించారు తెలుగుదేశం ప్రభుత్వంలో మైనార్టీ ఆడపడుచులకు దులహన్ పేరిట ఇస్తున్న 50000 సరిపోవటం లేదని తాము అధికారంలోకి రాగానే లక్ష రూపాయలు ఇస్తామని నమ్మ నమ్మబలికించి మైనార్టీ ఓట్లతో గెలిచి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నర సంవత్సరాలు దాటుతున్న వైయస్సార్ దులహన్ పేరిట ఇస్తామన్న లక్ష రూపాయలు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు వస్తున్న రంజాన్ తోఫా విదేశీ విద్య ఇమామ్మౌజన్ లకు రెట్టింపు జీతాలు ఇవ్వకపోవడంతో పాటు హజ్ యాత్రికులకు సబ్సిడీలో కోత విధించింది అన్నారు కడప జిల్లాలో ఉన్న హజ్ హౌస్ లో కనీసం ఒక్క ట్యూబ్ లైట్ కూడా వేయలేదని విమర్శించారు రంజాన్ నెలలో మసీదు మరమ్మత్తులకు డబ్బులు ఇవ్వకుండా పథకాలు తీసివేస్తే మైనారిటీ ఆడపడుచులు రోడ్డెక్కి నిరసనలు తెలిపి ఆందోళన జరిపి చివరకు కోర్టు ఎక్కితే కోర్టు మొట్టికాయలు వేసిన తర్వాత దుల్హన్ పథకం ఇవ్వలేమని కోర్టుకి రాతపూర్వకంగా రాసి ఇచ్చి ఇప్పుడు మరలా మోసం చేయడానికి అలివి కాని షరతులతో కూడిన జీవోఇవ్వడం మైనారిటీలను మోసం చేయడానికి కాదా అని ఆయన ప్రశ్నించారు రాష్ట్రం అంతటా మైనార్టీలలో వచ్చిన వ్యతిరేకతను గమనించి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మూడున్నర సంవత్సరాలు తర్వాత ఇటువంటి జీవో ఇవ్వడం మైనారిటీలను పచ్చి దగా మోసం చేసినట్లేనని విమర్శించారు మైనార్టీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ షరతులన్నీ సడలించి ఇస్తామన్న లక్ష రూపాయలు ఇవ్వాలని కోరారు దుల్హన్ పథకం కింద వచ్చే లక్ష రూపాయలను ప్రభుత్వం ఏర్పడిన వద్ద నుండి ఇచ్చి నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు

## రావులపాలెంలో భారీ అన్నసమారాధన



రావులపాలెం,ప్రజాపాలన ప్రతినిధి: కోనసీమ ముఖద్వారం వద్ద శ్రీ లక్ష్మీ గణపతి కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా గురువారం కమిటీ సభ్యులు శీలం శ్రీనివాస్, పాలూరి బుజ్జి, బోయిడి వెంకన్న బాబు (బద్రి) లైటింగ్ బాబీ బ్రదర్స్ డా,,నానాజీ నాగసావిత్రి దంపతులు,పెనుమస్స సోమరాజు,కొవ్వూరి సుబ్బిరెడ్డిఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తమనంపూడి అమ్మిరెడ్డి, కట్టా అవినాష్, మైక్ కృష్ణా రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



రావులపాలెం,ప్రజాపాలన ప్రతినిధి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో బుధవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా రూ.80 లక్షల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన 1, 2వ గ్రామ సచివాలయ భవనాలను, జనిపిరెడ్డి వారి పాలెంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్ ను, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.53 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అలాగే రూ.10 లక్షలతో నిర్మించే ముర్రావుపుంత రోడ్డుకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఇంకా డ్రైనేజీలు, రోడ్లు నిర్మించాల్సి ఉందని, త్వరలో ఆ పనులు కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ గంధం దేవి, ఎంపీటీసీ సభ్యులు కలిగినీడి సత్యవతి, సఖినాల నాగజ్యోతి, ఉప సర్పంచ్ సానబోయిన సత్యవేణి, సొసైటీ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ పమ్మి ప్రభాకరరావు, మాజీ జెడ్పీటీసీ సాకా ప్రసన్నకుమార్, పమ్మి సంపతరావు, కొల్లి బాలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, కోపెల్ల మల్లి, పమ్మి చంటి, గంధం అన్నవరం, గంధం పెదకాపు, కొప్పాడి రవీంద్ర, శిరిగినీడి రాంబాబు, ఎంపీడీవో జి. రాజేంద్రప్రసాద్, గ్రామ కార్యదర్శి ఎన్.వి.వి.ఎస్. బ్రహ్మాజీరావు, మండల ఇంజనీరింగ్ అధికారి డి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి: కమిషనర్ అనుపమ అంజలి



తిరుపతి,ప్రజాపాలన ప్రతినిధి: జగనన్న ఇళ్ళ నిర్మాణ పనులపై దృష్టి సారించి వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. చంద్రగిరి మండలం కొత్తపల్లి లే అవుట్ లోని నిర్మాణాలను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలిస్తూ ఆలస్యం కాకుండా సకాలంలో నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి అర్బన్ నివాసితులకు చంద్రగిరి మండలం కొత్తపల్లిలో కేటాయించిన ఆరు వేల ఇంటి స్థలాల్లో నిర్మాణాలు వివిధ దశల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కొన్ని నిర్మాణాలు బేస్ మెంట్ పూర్తి చేసుకోవడం, మరికొన్ని గోడలు పూర్తి చేసుకోవడం, మిగిలినవి స్లాబ్ లెవల్లో పనులు పూర్తి అయినట్లు వివరించారు. లే అవుట్లో ఇంటి నిర్మాణ పనుల్లో ఇబ్బంది రాకుండ ఇన్నర్ రోడ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఐరన్ కొరత లేకుండా హౌసింగ్ అధికారులతో కలిసి పని చేస్తున్నట్లు కమిషనర్ అనుపమ తెలిపారు. సిమెంట్ భద్రపరుచుకునేందుకు అవసరమైతే మరిన్ని గౌడవున్లు నిర్మించుకోవాలన్నారు. లే అవుట్లలో విద్యుత్ దీపాలు మరిన్ని ఏర్పాటు చేసుకోవాలని, నీరు కొరకు అవసరమైతే మరిన్ని బోర్లు వేసుకోవాలని సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, హౌసింగ్ డిఈ మోహనరావు, అమ్నేటి సెక్రట్రీలు పాల్గొన్నారు.

# నగరి మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి ఆర్కే రోజా



చిత్తూరు జిల్లా ,ప్రజాపాలన ప్రతినిధి: నగరి మున్సిపాలిటీ పరిధిలోని పుదుపేట నందు అంచనా విలువ రూ. 80.00 లక్షలతో నిర్మించిన జిల్లాలోనే మొట్టమొదటగా ప్రారంభోత్సవం చేస్తున్న డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనమును మంత్రివర్యు లు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లా కలెక్టర్ శ్రీహరి నారాయణ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ... కార్యక్రమా నికి విచ్చేసిన అతిరథమహారధులు కు ముందుగా ఆహ్వానం పలికారు. రాష్ట్రంలో వైద్య వ్యవస్థను గురించి వివరిస్తూ..దేశ చరిత్రలోనే రాష్ట్ర చరిత్రలోనే జగన్మోహన్ రెడ్డి ఎవరూ చేయనటువంటి సంస్కరణ లను వైద్య శాఖలో తీసుకువచ్చారని, ఏ విధంగా అయితే దేశ ప్రజలు ప్రతిపక్షాలు సైతం మెచ్చుకునే విధంగా చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అని అటువంటి వ్యక్తి పాలనలో మనముండడం మన అదృష్టం అని తెలిపారు.రెండు రోజులు రోజుల క్రితం వచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి గారు మన రాష్ట్రం లోని హాస్పిటల్స్ వాటి వనితీరు, ఆరోగ్యశ్రీ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాముఖ్యత ను పరిశీలించి శెభాష్ అని ప్రశంసించారని, సుమారుగా రాష్ట్రంలో 1125 పిహెచ్సి లకు రూ. 661.00 కోట్లతో అభివృద్ధి వనులు చేస్తున్నారని, మన నియోజకవర్గం వడమాలపేట మండల కేంద్రంలో అత్యాధునిక అత్యవసర సదుపాయాలతో కూడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొద్ది రోజులక్రితమే ప్రారంభించారని మన ప్రభుత్వం వచ్చిన తరువాత కోవిడ్ టైం లో కానీ ఇప్పుడు కానీ, అప్పుల పాలు కాకుండా పేద ప్రజలను కాపాడిన విషయం తెలిసిందే అనిఒక్క ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రమే ఉచిత కొవిడ్ వైద్య పరీక్షలు, మరియు వాక్సిన్ లను అందజేశారని అలాగే కోవిడ్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజా రోగ్యం పై పూర్తి శ్రద్ధ చూపారని, అంతే కాకుండా కోవిడ్ను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యం అందించారని,ఇవి సరిపోదన్నట్టు ప్రతి మండలానికి కూడా 2 పిహెచ్సి లను మంజూరు చేశారని,తదనుగునంగా ఇప్పుడు 176 కొత్త పిహెచ్సి లను సాంక్షన్ చేశారని,గతంలో చక్రము తిప్పానని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆసుపత్రులను కానీ ప్రభుత్వ బడులను కానీ పట్టించుకున్న పాపాన పోలేదన్న విషయం అందరికి తెలిసిందే అని తెలిపారు. ఈరోజు గర్వంగా నాడు నేడు కార్యక్రమం ద్వారా చాలా అద్భుతం గా మనం ఆసుపత్రుల ను, పాఠశాలను పునర్నిర్మాణం చేసుకుంటున్నామని ముందు చూపుతోకోవిడ్ లాంటి మరి యొక సందర్భం లాంటిది ఎదురైనా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా వుండే విధంగా ఆ దిశగా అడు గులు వేస్తున్నారని ,వైఎస్ఆర్ పీరి యడ్లో 108 సర్వీసులు ఆపదలో ప్రజలను కాపాడిన విషయం తెలిసిందే అని ఆయన తరువాత వాటిని సరిగా పట్టించుకోలేదని, జగనన్న వచ్చిన తరువాత ప్రతి మండలానికి ఒక కొత్త 108 మరియు 104 వాహనాలను మంజూరు చేశారని, ఇవ్వికాకుండా 10032 విలేజ్ క్లీనిక్ లను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ మొగ్గలోనే వ్యాధులను తుంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారని, కుటుంబంలో అన్నదమ్ములు అక్క చెల్లెళ్ల కోసం ఆలోచించి వారికి కూడా రాని ఆలోచనలను అందరికీ వర్తింపచేశారని, ఇటువంటి పార్టీలో ఉన్నందుకు మంత్రిగా నియోజకవర్గ ఎమ్మెల్యేగా చాలా గర్వపడుతున్నానని తెలిపారు. మంచినీరు మంచి గాలి మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించిన ఈ డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అందరు వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఇటువంటి బృహత్కర సౌకర్యాన్ని కల్పించిన ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డికి మన పూర్వ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్తో పాటు జిల్లా వైద్యశాఖ అధికారి జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డిప్యూటీ డైరెక్టర్ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మరియు మెడికల్ ఆఫీసర్లు మున్సిపల్ కమిషనర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మున్సిపల్ చైర్మన్లు వైస్ చైర్మన్లు కోఆప్షన్ నెంబర్లు అధికారులు ప్రజలు పాల్గొన్నారు

## విద్యార్థులకు క్రీడమైదానం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం



చిత్తూరు జిల్లాప్రజాపాలన ప్రతినిధి: : నగరి నియోజకవర్గం నింద్ర మండలంలోని ఆరూరు జడ్పీహెచ్ఎన్ పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకు మైదానం ఏర్పాటు చేయాలని విద్యార్థులకు క్రీడలు నేర్పించే ఉపాధ్యాయుడు జ్ఞాన కుమార్ ఆధ్వర్యంలో నగరి పట్టణంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ నారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో పాల్గొని ఎన్నో అవార్డులు గెలిచారు . ఈ సంవత్సరం కూడా ఐదు విద్యార్థులు మనిజ రాజశేఖర్ దర్శిని యామిని రాకేష్ వీరు పూణే లో జరిగిన జాతీయస్థాయి పోటీలో పాల్గొని మనిజ అనే విద్యార్థి సిల్వర్ మెడల్ గెలిచింది. ప్రస్తుతం నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధి చేయడంతో పిల్లలకు ఆడుకునేందుకు మైదానం లేదని పాఠశాలకు సమీప ప్రాంతంలో విద్యార్థులు ఆడుకునేందుకు మైదానం కేటాయించాలని జిల్లా కలెక్టర్ ను కోరినట్లు జ్ఞాన కుమార్ తెలిపారు.

## చిట్వేల్ హెల్ప్ లైన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్లో పదో తరగతి ప్రధమ మరియు ద్వితీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుమానం



అన్నమయ్య జిల్లా , ప్రజాపాలన ప్రతినిధి: చిట్వేలి మండల పరిధిలోని చిట్వేల్ హెల్ప్ లైన్ సొసైటీ ఆధ్వర్యంలో అజ్ఞాత దాత సహకారంతో కే కందుల వారిపల్లి మరియు వెంకటరాజుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి ప్రథమ మరియు ద్వితీయ స్థానాల్లో మార్కుల సాధించిన విద్యార్థులకు నగదు బహుమానం అందించడం జరిగింది హెల్ప్ లైన్ సొసైటీ సంస్థ చిట్వేలి మండలంలో చేస్తున్న సేవా అభివృద్ధి కార్యక్రమాలకు కే కందులవారిపల్లి మరియు వెంకటరాజుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్లు మరియు ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిట్వేల్ హెల్ప్ లైన్ సొసైటీ సభ్యులు గాడి ఇంతియాజ్ అహ్మద్, గాల శివారెడ్డి, వడ్డే శంకర్ రెడ్డి, కందుల నరసింహనాయుడు, నాగిరెడ్డి తిరుమలరెడ్డి ,నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు

## యల్లమరాజు చెరువుకట్ట ప్రాంత రాళ్లను తొలగించి వారిపై చర్యలు

### తిరిగి ఆ ప్రాంతాన్ని పునరుద్ధరిస్తాం: ఇరిగేషన్ డీఈ వెల్లడి



అన్నమయ్య జిల్లా ,ప్రజాపాలన ప్రతినిధి: కడప జిల్లాలోనే అతిపెద్దదైన ఎల్లమ్మ రాజు చెరువు కట్ట రాళ్లను తీసిన వారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ డి ఈ చంగల్ రాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన చెరువును సందర్శించి రాళ్ళను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతాన్ని సందర్శించి దాని పునరుద్ధరణ చర్యలను చేపడతామనిఆయనతెలియజేశారు. పటిష్టమైన చెరువు లోపలి భాగంలో రాళ్లు తీసివేయడం హేయమైన చర్య అని సమీప ప్రాంతం ప్రజలకు కూడా ఇలాంటివి జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండి తనకు తెలియజేయాలని అందుకేచిత్వేలి ఎస్సై వెంకటేశ్వర్లు ను కలిసి చెరువు పై నిఘా పెట్టాలని, అక్రమార్కులను అదుపులోకి తీసుకుని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ జరిగిన విషయాన్ని తమ దృష్టికి తీసుకు వచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు

## ఆపదలో ఉన్నవారిని మేమున్నాం..: పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ టీమ్



నెల్లూరు జిల్లా,ప్రజాపాలన ప్రతినిధి: దర్గామిట్ట,ప్రగతి నగర్ నందు అనారోగ్యంతో బాధపడుతున్న షేక్ మహబూబ్ బాషాకు పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో 18 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు రమేష్ రాజు మాట్లాడుతూ దర్గామిట్ట ప్రగతినగర్ కి చెందిన షేక్ మాభాష గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు వీపు పైన గడ్డ రావడంతో డాక్టర్స్ ఆపరేషన్ చేయాలనీ కోరారు వారి దగ్గర ఉన్న డబ్బులు మరియు అప్పులు చేసి మరి ఆపరేషన్ చేపించడం జరిగింది. డాక్టర్ సూచనలు ప్రకారం సంవత్సరం రోజులు లేవలేని పరిస్థితి తనకు ఆపరేషన్ చేసిన దగ్గర కనీసం రెండు నెలల నుంచి మూడు నెలల వరకు డ్రెస్సింగ్ రోజు చేపించాలని తెలిపారు. డ్రెస్సింగ్ కి కనీసం 700 రూపాయల నుంచి 1200 రూపాయలు అవుతున్నది. వారికి ఇద్దరు పిల్లలు వాళ్లు ఒక పూట కూడా తినలేని పరిస్థితిలో ఉన్నారు.వారి బాధ తెలుసుకొని దాతల సహకారంతో సంస్థ సభ్యులు సహకారంతో 18వేల రూపాయలను అందజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి సహాయ సహకారం అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం కి ఫ్యూచర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగూర్ నాయుడు 5000 వేల రూపాయలు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి సహాయపడాలని అండగా నిలవాలని కొరరు. పవర్ యూత్ స్వచ్ఛంద సేవ సొసైటీ ఆపదలో ఉన్న వారికి తమకున్నంతలో సహాయ పడడానికి ముందుంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీకాంత్ , సాయి తేజ,హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## గోవు త్యాగజీవి -గో సంరక్షణ ఒక మహా యజ్ఞం: డాక్టర్ మల్లు వేంకటరెడ్డి



తిరుపతి,ప్రజాపాలన ప్రతినిధి: సృష్టిలో తల్లి అంతటి స్థానాన్ని సంపాదించుకున్న గోవు త్యాగజీవి అని, అందుకే గోవును సంరక్షించడమంటే అది సాక్షాత్తు ఒక యజ్ఞమే నని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా తుగ్గలి మండలం, ముక్కెళ్ళ గ్రామం లోని శివాలయం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ప్రవచనాలు, భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి. నంది అవార్డు గ్రహీత పాయసం పెద్ద రంగారెడ్డి గత మూడు రోజుల నుండి శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ఉపన్యసించారు. స్థానిక భజన మండలిచే ప్రతి రోజూ భజనలు నిర్వహించారు. శుక్రవారం గోమాతతో ఊరేగింపుగా నగర సంకీర్తన , గోపూజతో పాటు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు వేంకటరెడ్డి గో సంరక్షణ ఆవస్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి సుజాతా రామచంద్ర, అరవ బాలమునిస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం అర్చకులు శ్రీనివాసులు, గ్రామ పెద్దలు కుసిమేని మునెప్ప, కె.సుదర్శనాచారి, బాలముని, శివాలయం అర్చకులు శాంతయ్య, ఆర్.ఎం.పి. వైద్యులు కె.దైవాదీనం, కె.సీతారాములు, కె.మునెప్ప, చిన్నకౌలుట్లయ్య, వరలక్షుమ్మ తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మాయ మాటలతో గడప గడపకు మన ప్రభుత్వం

### టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్



రావులపాలెం ప్రజాపాలన ప్రతినిధి: :కొత్తపేట నియోజకవర్గంలో గడపగడపకూ ప్రభుత్వం పేరిట వైసీపీ నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి భ్రమలు కల్పిస్తున్నారని కొత్తపేట నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్ అన్నారు. రావులపాలెం టిడిపి కార్యాలయం వద్ద గురువారం విజయ సాగర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి మాట వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎప్పుడో మరిచారని, లాభాలు తెచ్చిపెట్టే రోడ్డు నిర్మాణాలు తప్ప, ఉన్నవాటికి కనీసం మరమ్మత్తులు చేయించలేని స్థితిలో అధికార పార్టీ పెద్దలు ఉన్నారని ఆరోపించారు. కొత్తగా నియోజకవర్గంలో నేరసంస్కృతి పెరుగుతున్న దానిని అరికట్టడానికి కృషి చేయవలసింది పోయి, వాటిని పెంచి పోషించే విధంగా ప్రవర్తిస్తున్నారు. కొన్నిచోట్ల పాఠశాలలు ఆధునీకరణ పేరుతో లక్షలకు లక్షలు నిధులు వెచ్చించినా పనులను ప్రహసనంగా మార్చివేశారని విమర్శించారు.గడపగడపకు కార్యక్రమాన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే పర్యటిస్తూ సమస్యలు పరిష్కరించేశాం అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. గ్రామాల్లో కేంద్రం అందిస్తోన్న పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంటుందని. స్థానిక సంస్థలని నిర్వీర్యం చేసి, సహకార సంఘాలని గుప్పెట్లో పెట్టుకుని వాటిని వైసీపీ కార్యాలయాలుగా మార్చివేశారని దుయ్యబట్టారు.సచివాలయాల్లో వాలంటీర్లు, మద్యం దుకాణాల్లో సూపర్వైజర్లుగా వైసీపీ కార్యకర్తలకు పని కల్పించి, మొత్తం యువత అందరికీ ఉద్యోగాలు కల్పించేస్తున్నం అని అంటున్న వైసీపీ నేతలు మోసపూరిత మాటలు, మోసపూరిత వాగ్దానాలుతో ప్రజలును మభ్యపెట్టడానికి వైసీపీ నేతలు గడపగడపకు తిరుగాడుతున్నారన్నారు. ప్రజలంతా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై గడప గడపకు వస్తున్న వైసీపీ నాయకులను ప్రశ్నించాలని విజయ కుమార్ అన్నారు.

## సమాజసేవలో "డేవిడ్ మాదారపు" ఎప్పుడూ ముందుంటారు..?: జేసీఐ సన్ రైజర్స్ ప్రతినిధులు



శ్రీకాకుళం ప్రజాపాలన ప్రతినిధి: :వివిధ రంగాల ద్వారా సమాజానికి అండగా నిలుస్తూ ఆపన్న హస్తం అందించి సేవలు చేస్తున్న వారిని జేసీఐ సన్రైజర్స్ అధ్యక్షులు దూసి సంతోష్, హరికృష్ణ ప్రసాద్, నటుకుల మోహన్ అభినందించి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా "మాదారపు యశోదమ్మ సేవా సమితి " శ్రీకాకుళం జిల్లా "నందమూరి తారకరామా మోక్షజ్ఞ సేవా సంఘం, శ్రీకాకుళం జిల్లా ట్రెజరీ డిపార్ట్మెంట్ , డేవిడ్ మిత్రబృందం ద్వారా మాదారపు డేవిడ్ శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా తుఫాన్లు వచ్చిన సమయంలో గాని, కరోనా సమయంలో ఎన్నో విధాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అలాగే రక్తదాన, అన్నదాన, వస్త్ర దాన, మరియు రోగులకు ఆర్థిక సహకారం, పేద విద్యార్థులకు చదువు నిమిత్తం సహకారం అందించడం, ఒక పేద విద్యార్థిని డేవిడ్ సేవా సంఘాల ద్వారా దత్తతు తీసుకొని చదివించడం, తదితర కార్యక్రమాలు శ్రీకాకుళం జిల్లా లో చాలా సంవత్సరాలనుండి చేస్తున్నారని అందుకు డేవిడ్ కు, వారి సంఘ సభ్యులకు అభినందనలు తెలుపుతూ డేవిడ్ ను మెమొంటో ఇచ్చి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం డేవిడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింతగా సమాజనికి ఉపయోగ పడే సేవా కార్యక్రమాలు చేస్తామని తమను అభినందించిన జేసీఐ సన్రైజర్స్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠతో పాటు పలువురు వక్తలు పాల్గొన్నారు.

## సిక్కోలు సత్తా ప్రపంచదేశాలకు చాటిచెప్పాలి: రాష్ట్ర శిష్టకరణ యువత



శ్రీకాకుళం ప్రజాపాలన ప్రతినిధి: :అక్టోబర్ 26 నుండి 31 వరకు పోర్చుగల్లో జరగనున్న అంతర్జాతీయ షూటింగ్ పోటీలో శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో బీఏ చివరి సంవత్సరం చదువుతున్న గాంధీ వర్మ ఎంపికయ్యారు. ఆర్థికంగా చాలా పేదవాడు కావటంతో పోర్చుగల్కు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాడని తెలియటంతో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సిబ్బంది ఆర్థిక సహాయం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ సామాజిక కార్యకర్త డా. కనకరాజు గాంధీకి రూ.5000 అందజేసి, అంతర్జాతీయ షూటింగ్ పోటీలకు వెళ్లేందుకు గాంధీని ఆర్థికంగా ప్రోత్సహించాలని కోరారు. గాంధీ ఇటీవలే పూణే లో జరిగిన జాతీయ స్థాయిలో రన్నింగ్, స్విమ్మింగ్, షూటింగ్ పోటీలలో సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్ర శిష్టకరణ యువత గాంధీని అభినందిస్తూ సిక్కోలు సత్తా ప్రపంచదేశాలకు చాటిచెప్పాలని కోరారు.

## ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటాం: ఉద్దానం హెల్పింగ్ సొసైటీ



శ్రీకాకుళం ప్రజాపాలన ప్రతినిధి: :శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట గ్రామం కి చెందిన కావళ్ల . శ్రీను కొన్ని నెలల క్రితం ప్రమాదానికి గురై, గత నాలుగు నెలలుగా కోమాలో ఉండిపోయారు, ఇప్పుడు సంక్రమణ ఎక్కువ కావటంతో పేదరికం వల్ల కుటుంబ భారంతో పాటూ, తన వైద్యం కూడా చేసుకోలేని పరిస్థితి. తల్లిదండ్రులు లేకపోవటంతో దాతలు సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ముందుకు వచ్చి 10,000/- రూపాయలు ఆర్థిక సహాయం చేశారు, అలాగే వైద్యశాలలో శ్రీను వివరాలు తెలుసుకొని వైద్యునితో మాట్లాడి మందులు కూడా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో విజయ్, అశోక్, నగేష్, బాలకృష్ణ, స్వామిశివకోటి, షణ్ముఖ,రాజు, మరియు గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జగన్ను కలిసిన మంత్రి కొట్టు సత్యనారాయణ



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శాసనసభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం వైయస్ జగన్ను కలిసిన ఉపముఖ్యమంత్రి (దేవాదాయ, ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవాదాయశాఖ కమిషనర్ ఎం.హరి జవహర్లాల్, దుర్గగుడి ఈవో డి. భ్రమరాంబ, విజయవాడ తూర్పు నియోజకవర్గ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త దేవినేని అవినాష్.ముఖ్యమంత్రికి వేద ఆశీర్వచనంతో పాటు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసిన వేదపండితులు. దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించాల్సిందిగా సీఎం వైయస్ జగన్ను ఆహ్వానించిన దేవాదాయశాఖ మంత్రి, దేవాదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవోలు.

## 100 దేశాల్లో 'విక్రమ్ వేద'..బాలీవుడ్ లో రికార్డు ఇది!

హృతిక్ రోషన్–సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రల్లో కోలీవుడ్ బ్లాక్ బస్టర్ 'విక్రమ్ వేద' అదే టైటిల్ తో బాలీవుడ్ లోనూ రీమేక్ అవుతోన్న సంగతి తెలిసిందే. మాతృకకు దర్శకత్వం వహించిన పుష్కర్–గాయత్రి ద్వయమే హిందీ వెర్షన్ ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ పై అంచనాలు స్కైని టచ్ చేస్తున్నాయి. ఇటీవల రిలీజ్ అయిన ట్రైలర్ అంచనాలు అంతకంతకు పెంచేస్తుంది. దీంతో అభిమానుల్లో ఎప్పుడెప్పుడు చూద్దామ్మా? అన్న ఎగ్జైట్ మెంట్ రెట్టింపు అవుతుంది. 175 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన సినిమా సెప్టెంబర్ 30న రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో విడుదల సైతం భారీ ఎత్తున జరుగుతున్నట్లు తెలుస్తుంది. బాలీవుడ్ సినిమా చరిత్రలోనే ఓ సంచలన చిత్రంగా వరల్డ్ వైడ్ రిలీజ్ అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 100 దేశాల్లో చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. దీంతో బ్రహ్మాస్త్ర రికారడును రిలీజ్ పరంగా విక్రమ్ వేద బీట్ చేస్తున్నట్లు చెప్పొచ్చు. బ్రహ్మాస్త్ర ని వరల్డ్ వైడ్ దాదాపు 9000 థియేటర్లలో రిలీజ్ చేసారు. తాజాగా విక్రమ్ వేదని అంతకు మించి ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇంత వరకూ ఏ బాలీవుడ్ సినిమా 100 దేశాల్లో రిలీజ్ కాలేదు. కానీ విక్రమ్ వేదని చెప్పి మరీ మేకర్స్ థియేటర్లోకి తీసుకొస్తున్నారు. ఆరకంగా విక్రమ్ వేద రిలీజ్ కి ముందే బాలీవుడ్ లో ఓ సరికొత్త రికార్డుని క్రియేట్ చేసింది. ఈ సినిమాతో బాలీవుడ్ పరిస్థితి పూర్తిగా మారిపోతుందని అంచనాలు ఏర్పడుతున్నాయి.


ప్రజాపాలన దినపత్రిక 15 వార్షికోత్సవ శుభాకాంక్షలు



ప్రజాపాలన దినపత్రిక 15 వార్షికోత్సవ సందర్భంగ జిల్లాల వారీగా ప్రజాపాలన జాతీయ తెలుగు దినపత్రికను విస్తృత పరుస్తూ పజలకు చేరువ చేస్తున్న ప్రజాపాలన పత్రిక యాజమాన్యానికి శుభాకాంక్షలు.....

గోగులమూడి రాజు , పివి రావు మాల మహానాడు
కృష్ణా ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు.ఆంధ్ర ప్రదేశ్


## ప్రస్తుతానికి గాడ్ ఫాదర్ కంటే ఘోస్ట్ ఆధిపత్యం



దసరా కానుకగా అక్టోబర్ 5న తెలుగు స్టార్ హీరోలు చిరంజీవి నటించిన గాడ్ ఫాదర్ మరియు నాగార్జున నటించిన ది ఘోస్ట్ సినిమాలు విడుదల కాబోతున్న విషయం తెల్సిందే. ఈ రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఒకే రోజు సందడి చేసేందుకు రాబోతున్న నేపథ్యంలో సినీ ప్రేక్షకులతో పాటు ఇండస్ట్రీ వర్గాల వారు మరియు మీడియా సర్కిల్స్ వారు ఆసక్తిగా చూస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం ఇలా ఒకే రోజు ఇద్దరు స్టార్ హీరోల సినిమాలు విడుదల అవ్వడం జరిగింది. కానీ ఈ మధ్య కాలంలో మాత్రం ఇలా జరగడం లేదు. కనీసం గ్యాప్ ఉండేలా నిర్మాతలు చర్చలు జరుపుకుని మరీ ముందస్తుగా నిర్ణయాలు తీసుకుని విడుదల ప్లాన్ చేసుకుంటున్నారు. కానీ చిరు మరియు నాగ్ లు పోటీకే సిద్ధం అన్నట్లుగా అక్టోబర్ 5న విడుదల కు సిద్ధం అయ్యారు. ఈ రెండు సినిమాల్లో ఎవరి సినిమా ఆధిపత్యం కనబర్చుతుందా అంటూ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమయంలో ప్రస్తుతానికి నాగార్జున నటించిన ఘోస్ట్ సినిమా ఆధిపత్యం లో కొనసాగుతుంది అన్నట్లుగా కామెంట్స్ వినిపిస్తున్నాయి. నాగార్జున గత కొన్నాళ్లుగా సినిమాకు సంబంధించిన హడావుడి సోషల్ మీడియా ద్వారా లేదా మరో రకంగా చేస్తూనే ఉన్నారు. సినిమాకు సంబంధించిన ప్రమోషనల్ స్టఫ్ ని రెగ్యులర్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ద్వారా సినిమా గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. దాంతో గాడ్ ఫాదర్ కంటే కూడా ది ఘోస్ట్ కి ప్రస్తుతం నెట్టింట హైప్ ఎక్కువగా ఉన్నట్లుగా తెలుస్తోంది. సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఏంటో కానీ ఇప్పటి వరకు ది ఘోస్ట్ ఆధిపత్యం కొనసాగుతుందని అంటున్నారు. నాగార్జున ఇటీవలే బ్రహ్మాస్త్ర సినిమాలో కీలక పాత్ర చేసి ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా కు నెగటివ్ టాక్ వచ్చినా కూడా పాజిటివ్ గానే వసూళ్లు ఉన్నాయి. అందుకే ది ఘోస్ట్ సినిమాను తెలుగు తో పాటు హిందీలో కూడా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారట. అక్కడ కూడా ఒక స్థాయి వరకు థియేటర్లలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రమోషన్ కూడా అక్కడ నార్మల్ గానే చేయబోతున్నారట. గాడ్ ఫాదర్ మాత్రం హిందీ రిలీజ్ పై ఆసక్తిని కనబర్చడం లేదు అనే విషయం తెల్సిందే. ఆ విషయంలో కూడా ఘోస్ట్ ఆధిపత్యం కనిపిస్తోంది.

## 'పొన్నియిన్ సెల్వన్' కు హైలైట్ ఆ క్యారెక్టరేనా?

సూపర్ స్టార్ రజనీకాంత్ గత కొన్నేళ్ల క్రితం నటించిన బ్లాక్ బస్టర్ మూవీ 'నరసింహా'. తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైన ఈ మూవీ రెండు భాషల్లోనూ సంచలన విజయాన్ని సొంతం చేసుకుని బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుంది. సినిమా ఎంత గా పాపులర్ అయిందో అంతకు మించి ఈ మూవీలో నీలాంబరిగా నటించిన రమ్యకృష్ణ పాపులర్ అయింది. విశేషం ఏంటంటే ఈ మూవీకి రజనీకాంత్ కథ అందించారు. నీలాంబరి పాత్రని 1950లో ప్రముఖ రచయిత కల్కి కృష్ణమూరి రాసిన 'పొన్నియిన్ సెల్వన్'లోని నందిని పాత్ర స్ఫూర్తితో రాసుకున్నారట. ఈ విషయాన్ని ఇటీవల చెన్నైలో జరిగిన 'పొన్నియిన్ సెల్వన్ 1' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో వెల్లడించారు రజనీ. దీంతో మణిరత్నం డ్రీమ్ ప్రాజెక్ట్ 'పొన్నియిన్ సెల్వన్ 1' హాట్ టాపిక్ గా మారింది. దాదాపు 30 ఏళ్లుగా ఈ ప్రాజెక్ట్ ని తెరపైకి తీసుకురావాలని మణిరత్నం విశ్వప్రయత్నాలు చేశారు. గతంలో రెండు సార్లు ప్రయత్నించి ఫైనాన్షియర్ లు ముందుకు రాకపోవడంతో తన ప్రయత్నాలని విరమించుకున్నారు. ఎట్టకేలకు లైకా ప్రొడక్షన్స్ అధినేత ఏ. సుభాస్కరన్ ముందుకు రావడంతో మణిరత్నం కలల ప్రాజెక్ట్ 'పొన్నియిన్ సెల్వన్' ఫైనల్ గా కార్యరూపం దాల్చింది. చియాన్ విక్రమ్ కార్తి జయం రవి ఐశ్వర్యారాయ్ త్రిష కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ మూవీ ఫస్ట్ పార్ట్ ని సెప్టెంబర్ 30న భారీ స్థాయిలో ఐదు భాషల్లో పాన్ ఇండియా ఫిల్మ్ గా రిలీజ్ చేస్తున్నారు. తెలుగులో ఈ మూవీని స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు రిలీజ్ చేస్తున్నారు. అయితే తమిళ్ తో పోలిస్తే తెలుగులో ఈ మూవీకి పెద్దగా బజ్ లేదు. సినిమా రిలీజ్ కి కేవలం పదిహేను రోజులే వున్నా మేకర్స్ నుంచి ఎలాంటి హడావిడీ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఐశ్వర్యారాయ్ పోషిస్తున్న నందిని పాత్రకు సంబంధించి



ఓ ఆసక్తికరమైన అప్ డేట్ బయటికి వచ్చింది. సినిమాపై హైప్ ని క్రియేట్ చేస్తోంది. సినిమాలో ఐశ్వర్యారాయ్ పాత్ర చాలా కీలకంగా నిలుస్తుందని తెలుస్తోంది. 'నరసింహా'లో ఈ పాత్రని స్ఫూర్తిగా తీసుకునే నీలాంబరి పాత్రని సృష్టించానని రజనీ చెప్పడంతో ఇప్పుడు అందరి దృష్టి ఐశ్వర్యారాయ్ పాత్రపై పడింది. దీంతో ఐశ్వర్య పాత్ర నేపథ్యం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. 'పొన్నియిన్ సెల్వన్ 1'లో ఐశ్వర్యారాయ్ డ్యుయెల్ రోల్ లో కనిపించబోతోంది. అందులో తన ప్రేమికుడిని తన కళ్లముందే శిరచ్ఛేదన చేసిన ఆదిత్య కరికాలన్ పై అతని చోళరాజ్యంపై ప్రగ ప్రతీకారాలతో రగిలిపోయే పాత్రలో కనిపించబోతోంది. ఈ పాత్ర 'నరసింహా'లో రమ్యకృష్ణ నటించిన నీలాంబరి పాత్రని పోలి వుండటంతో సినిమాకు ఐశ్వర్యారాయ్ పాత్ర ప్రధాన హైలైట్ గా నిలవనుందని తెలుస్తోంది.




" ఒక పెద్ద దేశం, చిన్న దేశాన్ని
అణిచివేయాలని చూస్తే
నేను చిన్న దేశం వైపు నిలబడతాను.

ఆ చిన్న దేశం లోని మెజారిటీ మొత్తం,
చిన్న మతాన్ని అణగద్రొక్కాలని చూస్తే...
నేను చిన్న మతం వైపు నిలబడతాను.

ఆ మైనారిటీ మతంలో కులాలుండి,
అది ఒక కులం, మరో కులాన్ని
అణగద్రొక్కాలని చూస్తే ...
నేను ఆ అణిచివేతకు గురయ్యే
కులం వైపు నిలబడతాను.

ఆ అణిచివేతకు గురైన కులంలో ,
ఒక యజమాని తన నౌకరును అణిచివేస్తుంటే
నేను ఆ నౌకరి వైపు నిలబడతాను.

ఆ నౌకరు తన ఇంట్లో తన భార్య హక్కుల్ని
కాలరాస్తుంటే.. నేను ఆ నౌకరి భార్య వైపు
నిలబడి గొంతెత్తుతాను.

చివరకు నేను చెప్పేది ఏంటంటే
అణచివేత అనేది ఏ స్థాయిలో,
ఏ స్థితిలో ఉన్న అది నా శత్రువు "

Periyar E V Ramasamy
17 September 1879 - 24 December 1973

ADARSHA
FOUNDATION
Regd No. 2501/2012
Hyderabad


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com